

కాంతులీనుతున్న విద్యుత్ ప్రభ (ఫైల్)

నేత్ర పర్వం ప్రభల సంబరం

- ఒక్కో ప్రభ ఎత్తు 90 అడుగులు
- పోటాపోటీగా విద్యుత్ ప్రభల నిర్మాణం
- ప్రభల పండుగగా కోటయ్య తిరునాళ్ల ప్రసిద్ధి

(కోటప్పకొండ/నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

మహిమాన్విత క్షేత్రంగా వెలుగొందుతున్న కోటప్పకొండ తిరునాళ్లలో కొలువు తీరే ప్రభలు నేత్ర పర్వంగా దర్శనమివ్వనున్నాయి. మహా శివరాత్రి పండుగ సందర్భంగా ప్రముఖ శైవక్షేత్రం కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వరస్వామి సన్నిధిలో 26న బుధవారం జరిగే తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు జరుగుతున్నాయి. దేశ ప్రసిద్ధి చెందిన కోటయ్య తిరునాళ్లకు ప్రభల పండుగగా ప్రసిద్ధి చెందింది. కొండకు తరలివచ్చే భారీ విద్యుత్ ప్రభలను తిలకించేందుకు ప్రత్యేకంగా భక్తులు తరలివచ్చి సంబరపడతారంటే ఆశ్చర్యం కాదు. కొండపై కొలువైన కోటయ్యస్వామి కిందకు దిగి రావాలంటే కోటిన్నొక్క ప్రభ నిర్మించాలని స్థల పురాణం చెపుతున్నది. అందుకే తిరునాళ్లకు అధిక సంఖ్యలో ప్రభలను భక్తులు నిర్మించి తీసుకొస్తారు. మహాశివ రాత్రికి భక్తులు కొండలో జాగరణ చేస్తారు. తెల్లవార్లు ప్రభల వెలుగులు ఒకవైపు, మరోవైపు ప్రభలపై సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తులు జాగరణ పూర్తి చేస్తారు. ఒక్కో ప్రభ 90 అడుగులకుపైగా ఎత్తులో రూపుదిద్దుకుంటుంది. ప్రభల వ్యయం రూ.కోట్లల్లో ఉంటుంది. ప్రభలపై రంగు రంగుల లైట్లు, వీటిని వెలిగించే విధానం చూపరులను కట్టి పడేస్తుంది. భారీ విద్యుత్ ప్రభలతో పాటు సాధారణ ప్రభలను పెద్ద సంఖ్యలో భక్తులు కోటయ్యస్వామి సన్నిధికి తరలించేందుకు సిద్ధం చేస్తున్నారు. విద్యుత్ ప్రభల వెలుగులు కళ్ళు మిరుమిట్లు గొలుపుతాయి. చిన్నారులు ప్రభలు కట్టుకుని చిలకలూరిపేట, నరసరావుపేట తదితర ప్రాంతాల నుంచి కాలి నడకన ఉత్సాహంగా కొండకు తరలివస్తారు. మొక్కుబడి ప్రభలతో నడిచి రాలేని వారు వాహనాలపై వీటిని అమర్చుకుని కొండకు తరలివస్తారు. ప్రభలపై సంగీత విభావరి, నృత్యాలు నిర్వహిస్తారు. గతంలో రికార్డింగ్ డ్యాన్సులు నిర్వహించే వారు. పోలీసు శాఖ వీటిని నిషేధించింది.

గ్రామాల్లో పోటాపోటీ..

ప్రభల నిర్మాణంలో గ్రామాలకు గ్రామాలు పోటీ పడతాయి. గ్రామ గౌరవ ప్రతిష్ఠ కోసం అందంగా ప్రభలను నిర్మించడంలో పోటీ ఉంటుంది. ఈ ప్రభలలో పోస కూర్పు ప్రభలు, మండపాల ప్రభలు, టిక్కీల ప్రభలు, విద్యుత్ ప్రభలు, బాల ప్రభలు తదితరాలు ఉంటాయి. సంస్కృతి, సంప్రదాయాలకు ఇవి అద్దం పడతాయి. చిలకలూరిపేట మండలంలోని కావూరు, మద్దిరాల, యడవల్లి, కమ్మవారి పాలెం, పురుషోత్తపట్నం, నాదెండ్ల మండలం అమీన్‌సా హెబ్‌పాలెం, అప్పాపురం, నరసరావుపేట మండలం ఉప్పలపాడు, గురవాయపాలెం గ్రామాల నుంచి భారీగా విద్యుత్ ప్రభలు కొండకు తరలిరానున్నాయి. గతంలో ఎడ్లతో ప్రభలను తరలించే వారు. నేడు ట్రాక్టర్ల ద్వారా ప్రభలను తరలిస్తున్నారు. రాతితో తయారు చేసిన చక్రాల రథాలపై ప్రభలను ఏర్పాటు చేసి కొండకు తరలిస్తారు. 90 అడుగుల ఎత్తులో నిర్మించే ప్రభలను ప్రత్యేకంగా తయారు చేసిన రథాలపై అమరుస్తారు. ప్రభ పగ్గాలు పట్టేందుకు వందలాది మంది పాల్గొంటారు. రథం ఇరుసు విరిగితే వెను వెంటనే తయారు చేసేందుకు సంబంధిత పని వారు వెంట నడుస్తారు.

పెండ్లి కుమారుడిగా అమరేశ్వరుడు

- అమరావతిలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభమ య్యాయి. ఆలయ వంశపా రంపర్య ధర్మకర్త వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్ తరఫున స్వామివార్లకు పీసపాటి అమరేశ్వర శర్మ పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. అర్చకులు, వేదపండితులు మంగళవా యిద్యాలు, వేదమంత్రోశ్చరణల మధ్య అమరేశ్వరుడ్ని పెండ్లి కుమారుడిగా చేశారు. కార్యక్రమంలో ఈవో సునీల్‌కుమార్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాల కాంతిలో ప్రధాన రాజగోపురం

పెళ్లికుమార్తెగా కాకాని భ్రమరాంబ

పెదకాకాని, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమ య్యాయి. మాఘ ఆదివారం సందర్భంగా ఆలయం భక్తులతో కిటకిటలాడింది. భక్తులు అధిక సంఖ్యలో పొంగళ్లు తయారు చేసి స్వామి వారికి నివేదన చేశారు. మేళతాళాల నడుమ ప్రభలతో ఆలయానికి వచ్చిన భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తొలిరోజు భ్రమరాంబ అమ్మవారు పెండ్లికుమార్తె అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సుప్రభాతసేవ, పంచహారతులు రుద్రాభిషేకం, విఘ్నేశ్వర పూజలతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉపకమిషనరు గోగినేని లీలాకుమార్ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సోమవారం అమ్మవారు శ్రీవనదుర్గాదేవి అలంకారంలో దర్శనమిస్తారని ఈవో తెలిపారు.



పెళ్లి కుమార్తెగా భమరాంబ అమ్మవారు

అమరావతి టవర్లు డయాగ్రిడ్ డిజైన్‌తో..

- నూతన సాంకేతికతతో భవనాల నిర్మాణం
- కరకట్టకు రెండు వైపులా రక్షణ గోడ
- నాలుగు లేన్ల రహదారికి తగ్గనున్న వ్యయం
- నీటి యాజమాన్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ
- అమరావతి నిర్మాణ పనులపై కీలక నిర్ణయాలు

అమరావతి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సాంకేతికంగా అత్యాధునికమైన 'డయాగ్రిడ్' డిజైన్‌లో రాజధాని టవర్లను నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది. మున్సిపల్ మంత్రి నారాయణ అధ్యక్షతన తాజాగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో రాజధాని నిర్మాణ పనులపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కరకట్ట మీదగా రాజధాని నగరానికి నిర్మించే నాలుగు లేన్ల రహదారికి అయ్యే ఖర్చును అంచనా వేశారు. అసెంబ్లీ, సచివాలయం, హైకోర్టు భవనాలు, రాజధాని నగరానికి తాగునీరు, మురుగునీరు యాజమాన్య నిర్వహణపై సమగ్రంగా చర్చించారు. నీటి యాజమాన్య నిర్వహణపై ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని తీర్మానించారు. రాజధాని పనులన్నీ సమగ్రంగా, సమాంతరంగా జరగడానికి అన్ని శాఖలు ఒక టీంలా పనిచేయాలని నిర్ణయించారు.

ముఖ్యమైన నిర్ణయాలు ఇవీ..

రాజధాని అమరావతికి ప్రస్తుతం ఇరుకుగా ఉన్న కృష్ణానది కరకట్ట మీదగా వెళ్లాలి. ఈ రోడ్డుపై ఎదురెదురుగా రెండు వరుసల్లో భారీ వాహనాలు వెళ్లే వీలు లేదు. అందువల్ల కరకట్ట మీదగా రాజధానికి విశాలమైన నాలుగు వరుసల రహదారి నిర్మాణం అత్యవసరంగా చేపట్టాలని, దీనికోసం కరకట్టకు ఇరువైపులా సిమెంట్ రిటైనింగ్‌వాల్‌ను నిర్మించాలని నిర్ణయించారు. రిటైనింగ్ వాల్‌ను నిర్మించకుండా బంకమట్టి వేసి దానిపై రహదారి నిర్మాణం చేపడితే.. రక్షణ లేకపోవడమే కాకుండా నిర్మాణ వ్యయం రూ.2,600 కోట్లు ఖర్చవుతుందని తేల్చారు. కరకట్టకు ఇరువైపులా సిమెంట్ రిటైనింగ్‌వాల్ నిర్మించి రహదారి వేస్తే రూ.1,800 కోట్లు అవుతుందని ఇంజనీరింగ్ అధికారులు లెక్కలుగట్టారు. రక్షణ గోడలతో రహదారికి భద్రత ఉండటమే కాకుండా.. నిర్మాణ వ్యయమూ తగ్గుతుండటంతో ఈ విధానంలోనే రోడ్డు నిర్మించాలని తీర్మానించారు.

- రాజధాని నగరంలోని నిర్మాణాలను మున్సిపల్, ఇరిగేషన్, ఇంధన తదితర శాఖల సమన్వయంతో చేపట్టాలని నిర్ణయించారు.
- సంక్లిష్టమైన సాంకేతిక విధానాలతో కూడుకున్న భవన నిర్మాణాలకి స్టాండర్డ్ షెడ్యూల్డ్ రేట్(ఎస్ఎస్ఆర్) ఖరారు చేయడానికి సిఫార్సు చేయాలని తీర్మానించారు. డయాగ్రిడ్ డిజైన్‌లో నిర్మాణంలో వాడే స్టీల్ అత్యంత ఖరీదుతో కూడు కున్నది. ఫ్యాబ్రికేషన్, వెల్డింగ్‌ను కూడా అత్యాధునిక సాంకేతిక విధానంలో చేపట్టాల్సి ఉంటుంది. దీనికి నిపుణులైన పనివారు అవసరమవుతారు. వీరికి సాధారణ కూలీ లకంటే రెట్టింపు చెల్లించాలి. ఎస్ఎస్ ఆర్‌లో లేని దీనిని ఎస్ఎస్ఆర్‌లో చేర్చాల్సి ఉందని నిర్ణయించారు. భారీ నిర్మాణాల్లో అగ్ని నిరోధక విధానాలను అవలంబించాల్సి ఉంటుంది. అగ్ని నిరోధక విధానాలకు అత్యంత ప్రాధా న్యం ఇవ్వాలని అభిప్రాయం వ్యక్తం చేశారు.
- రాజధాని మౌలిక వసతుల్లో అత్యంత ప్రధానమైనది తాగు, మురుగునీటి యాజమాన్య నిర్వహణ వ్యవస్థలు. వందేళ్లకు సరిపడా అవసరాలను దృష్టిలో ఉంచుకుని తాగునీటి రిజర్వాయర్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందని నిర్ణయించారు.

డయాగ్రిడ్ విధానం అంటే..

రాజధాని నగర నిర్మాణాలను సరికొత్తగా డయాగ్రిడ్ డిజైన్ విధానంలో చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో దీనిపై అందరిలోనూ ఆసక్తి నెలకొంది. సాధారణంగా భవన నిర్మాణాల కోసం ముందుగా పునాదులు తవ్వి పిల్లర్లను వేసి శ్లాబ్ వేస్తారు. ఇలా అం తస్తుల మీద అంతస్తులు నిర్మిస్తారు. డయా గ్రిడ్.. అంటే డయాగ్నల్‌గా గ్రిడ్ రూపంలో ఉండే భవంతి డిజైన్‌లో ముందుగా మధ్యలో ఒకపెద్ద దిమ్మ తరహాలో నిటారుగా పిల్లర్‌ను పైకి లేపుతారు. పిల్లర్ చివరిలో శ్లాబులను వేసేందుకు అనువుగా కాంక్రీట్‌తో కూడిన సపోర్టును ఇస్తారు. వాటిని ఆధారంగా చేసుకుని శ్లాబులు వేస్తారు. అంటే.. సైకిల్ లేదా మో టారు సైకిల్ చక్రాన్ని పడుకోబెడితే.. మధ్య లోని హబ్ బేస్‌గా రిమ్‌కు ఊచలు కలిపి ఉండే తరహాలో డయాగ్రిడ్ డిజైన్ కూడా ఉంటుంది. ఐమూలగా అతికించిన ఐరన్, కలప లేదా కాంక్రీట్ బీమ్‌లతో ఒక్కో ఫ్లోర్ ను తీర్చిదిద్దుతారు. చుట్టు అద్దాలు అతికించి బిల్డింగ్‌ను నిర్మిస్తారు. సంప్రదాయ విధానం లో వాడే ఇనుము కన్నా డయాగ్రిడ్ విధా నంలో ఇనుమును త క్కు వ గా వినియో గి స్తారు.



నిర్లక్ష్యం.. ప్రాణాలు పణం



- రోడ్లపైకి భారీగా ఆటోలు, బైక్‌లు
- నిబంధనలు పట్టించుకోని వాహనదారులు
- పరిమితికి మించి ప్రయాణికులు.. ఓవర్ స్పీడ్
- ప్రమాదం జరిగినప్పుడే పోలీసు, రవాణాశాఖ హడావిడి
- మొక్కుబడిగా చేస్తున్న రహదారి భద్రత మాసోత్సవాలు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఓవర్‌లోడు.. ఓవర్ స్పీడు.. ఇదీ జిల్లాలో ఆటోలు, ద్విచక్ర వాహనాల రాకపోకలు. ఇరుకు రోడ్లపైన, రద్దీగా ఉండే రహదారుల్లోనూ ఆటోలు, బైక్‌ల విన్యాసాలతో ప్రమాదాలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. కళ్లెదుట నిండు ప్రాణాలు బలవుతున్నా.. వాహన చోదకులు నిర్లక్ష్యం వీడటంలేదు. మితిమీరిన వేగంతో వాహనాల్ని నడుపుతూ తమతో పాటు ఎదుటి వారి ప్రాణాలను కూడా తీస్తున్నారు. పరిమితికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఎక్కించడం, ద్విచక్ర వాహనదారులు శిరస్త్రాణం ధరించకపోవడంతో ప్రమాదాల్లో చనిపోతున్న వారి సంఖ్య అధికంగా ఉంటున్నది. అతివేగం, నిర్లక్ష్యం, మద్యం తాగి వాహనాన్ని నడపడం, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవింగ్.. ఇలా కారణం ఏదైనా నిండు ప్రాణాలు బలైపోతున్నాయి. రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతుండగా వీటిలో అధికశాతం ద్విచక్రవాహనాల తర్వాత ఆటోలే ఉంటున్నాయి. నిత్యం ఏదో ఒక మూల ప్రమాదాల రూపంలో మృత్యుఘంటికలు మోగుతూనే ఉన్నాయి. రోడ్డు ప్రమాదాలను నివారించడంలో పోలీసు శాఖ నిర్లక్ష్యంతోడు రవాణాశాఖ వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. వాహన చోదకులకు కల్పించే అవగాహన కార్యక్రమాలు మొక్కుబడి తంతుగా మారుతున్నాయనేందుకు తరచూ జరుగుతున్న ప్రమాదాలే నిదర్శనం. ఏటికేడు ఆటోల సంఖ్య పెరిగిపోతున్నది. వాటిని నడిపే వాళ్ల డ్రైవింగ్‌పై కనీస అవగాహన లేకపోవడంతో పాటు నిద్ర, మద్యం మత్తు దారుణాలకు కారణమవుతోంది. ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం, ఈ క్రమంలో జాతీయ రహదారిపై పాటించాల్సిన నిబంధనలకు యథేచ్ఛగా పాతరేస్తున్నా పట్టించుకునే వారు లేరు. పరిమితికి మించి ప్రయాణికులకు ఆటోలు, ట్రాక్టర్లలో తరలిస్తున్నా పట్టించుకోవడం లేదు. రోడ్డు భద్రతా వారోత్సవాలు పేరిట అధికారుల హడావిడే తప్ప వాటి వల్ల ఒనగూరుతున్న ప్రయోజనం గుండుసున్నా. గత నెల 16 నుంచి ఈనెల 15 వరకు 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు నిర్వహించారు. రవాణా, ఆర్టీసీ, పోలీసు, తదితర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాలు జరిగాయి. అయితే ప్రారంభం రోజు మినహా మిగిలిన రోజుల్లో పెద్దగా అవగాహన, ప్రమాదాల నియంత్రణపై చర్యలు చేపట్టిన దాఖలాలు లేవు.



ఆటోలో పరిమితికి మించి ప్రయాణికులు

పల్నాడు జిల్లాలో రోడ్డు ప్రమాదాల వివరాలు

సంవత్సరం	సంఖ్య	మృతులు	క్షతగాత్రులు
2021	791	441	739
2022	733	407	663
2023	576	397	490
2024	612	379	590
2025	64	39	47

బ్లాక్‌స్పాట్ల గుర్తింపుతో సరి..

తరుచుగా ప్రమాదాలు జరుగుతున్న బ్లాక్ స్పాట్ ప్రాంతాలను గుర్తించి బోర్డుల ఏర్పాటులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సర్వీస్ రోడ్డులో నుంచి హైవేపైకి వచ్చే సమయంలో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. బ్లాక్ స్పాట్‌లను గుర్తించే విషయంలో నిర్లక్ష్యం, ప్రమాదం జరిగినప్పుడు హడావిడి తప్ప మూలాల్లోకి వెళ్లే ప్రయత్నమే చేయడం లేదు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిని కట్టడి చేయడంలో పోలీసు, రవాణాశాఖల వైఫల్యం స్పష్టంగా కనబడుతోంది. జరిమానాల కోసమే డ్రంకెన్ డ్రైవ్ అన్న అభిప్రాయం వాహన చోదకుల్లో స్థిరపడింది.

15 మంది సిబ్బందికి మెమోలు

- ప్రిన్సిపాల్‌పై శాఖాపరమైన చర్యలు

మోసాలకు అడ్డుకట్ట!

- మిర్చియార్డులో ఇంటిగ్రేటెడ్ కాటాల ఏర్పాటు
- మార్కెటింగ్ శాఖకు సీఎం ఆదేశం
- కొద్ది రోజుల్లో ప్రొక్యూర్‌మెంట్ చేయనున్న అధికారులు

7


ప్రశాంతంగా గ్రూపు-2 మెయిన్ పరీక్షలు

- పేపర్-1 పరీక్షకు 85.45 శాతం మంది హాజరు
- పేపర్-2కి 85.37 శాతం మంది
- పరీక్ష కేంద్రాలను సందర్శించిన జేసీ భార్గవ తేజ



8

గుంటూరు ఏసీ కళాశాలలో రూం నెంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



పరీక్షల ముందు ఇలా చదవండి

త్వరలో తెలుగు రాష్ట్రాల్లో బోర్డు పరీక్షలు మొదలు కాబోతున్నాయి. రెండు రాష్ట్రాల్లో కలిపి గత సంవత్సరం సుమారు 10 లక్షల మంది పదో తరగతి, 12 లక్షల మంది ఇంటర్మీడియట్ పరీక్షలు రాశారు. ఈ సంవత్సరం కూడా దాదాపు అంతే సంఖ్యలో విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నారు. సమగ్రమైన ప్రణాళిక, సమయ నిర్వహణతో ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విద్యా నిపుణులు చెబుతున్నారు. బోర్డు పరీక్షల మార్కులు ఉన్నత విద్యా అవకాశాలను నిర్ణయిస్తాయి. ప్రిపరేషన్ బాగుంటే ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. పరీక్షా హాల్‌లో సమయం సరిపోతుంది. అలాగే సరైన స్టడీ ప్లాన్, రివిజన్, మాక్ టెస్టులు రాయడం వల్ల బాగా గుర్తుంటాయి. టాపర్ల టిప్స్ అనుసరించడం, తప్పులు తగ్గించడం ఉత్తమ ఫలితాలకు దోహదం చేస్తాయి. పరీక్షలకు ఉన్న ఈ కొద్ది రోజుల్లో స్మార్ట్ వర్క్ ముఖ్యం అంటున్నారు నిపుణులు...

ప్లానింగ్ ముఖ్యం

1. తప్పక చదవాల్సిన చాప్టర్లను గుర్తించండి. బోర్డు పరీక్షలలో ఎక్కువ స్కోరింగ్ టాపిక్స్ తెలుసుకోండి.
2. రోజువారీ టైమ్ టేబుల్ తయారు చేసుకోండి. ప్రతి రోజు చదవడానికి ఖచ్చితమైన సమయాన్ని కేటాయించండి.
3. చిన్న చిన్న లక్ష్యాలను నిర్ధారించుకోండి. కష్టమైన సబ్జెక్టులో ఒక్కో రోజు ఒక హార్డ్ చాప్టర్, ఈజీ చాప్టర్ లేదా ముఖ్యమైన టాపిక్స్ పూర్తిచేయండి.
4. సమయం వృధా చేయొద్దు. మొబైల్, టీవీ వంటి దృష్టి మళ్లించే విషయాలను తగ్గించాలి.
5. కనీసం 6-8 గంటలు నిద్ర ముఖ్యం.

మంచి మార్కుల చిట్కాలు

6. సొంత నోట్స్ ప్రిపేర్ చేసుకోండి. ముఖ్యమైన పాయింట్లు, ఫార్ములాలు, డయాగ్రామ్స్ ఒక దగ్గర రాసుకోండి.
7. రివిజన్ చేయండి. ఒకే విషయాన్ని పదే పదే చదివితే మరచిపోయే ప్రసక్త లేదు.
8. పాత ప్రశ్నపత్రాలను ప్రాక్టీస్ చేయండి. గత 5-10 ఏళ్ల ప్రశ్నపత్రాలను రాసి ప్రాక్టీస్ చేయండి. అకడమిక్ పరీక్షల్లో ఇవే దాదాపుగా రిపీట్ అవుతుంటాయి.
9. పరీక్షల్లో టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. మాక్ టెస్ట్ రాయడం ద్వారా లోటుపాట్లను అధిగమించవచ్చు.

సబ్జెక్టుకు ఒక వ్యూహం

10. మేథ్స్ రోజూ ప్రాక్టీస్ చేయాలి. రోజుకు కనీసం 10-15 ముఖ్యమైన లెక్కలు సాల్వ్ చేయండి.
11. సైన్స్ విషయంలో ఫార్ములాలు, డయాగ్రామ్స్, ఈక్వేషన్స్, రియాక్షన్స్ ఒక దగ్గర రాసుకుని ప్రాక్టీసు చేయండి.
12. సోషల్ స్టడీస్‌లో డేట్స్, ఈవెంట్స్ ముఖ్యం. కథల మాదిరిగా చదివి అర్థం చేసుకోవడం ఉత్తమం.
13. ఇంగ్లిష్, తెలుగు సబ్జెక్టుల్లో వ్యాకరణం ప్రాక్టీస్ చేయండి. ముఖ్యమైన వ్యాకరణ నియమాలను రాసి చదవండి.
14. స్మార్ట్ స్టడీ మెథడ్స్ ఉపయోగించండి.

పరీక్ష రోజు

15. తక్కువ ఒత్తిడితో చదవండి. కొండను ఎత్తుకుంటున్నట్లుగా కాకుండా ఆసక్తిగా చదవండి.
16. ఒత్తిడిని తగ్గించుకోవడానికి రోజుకు 10 నిమిషాలు ధ్యానం, యోగా వంటివి చేయండి.
17. ఆకుకూరలు, పండ్లు, డ్రైఫ్రూట్స్ వంటి పోషకాహారాన్ని పెంచండి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం ద్వారా మెదడు చురుకుగా ఉంటుంది.
18. పరీక్ష ముందు రోజు కొత్త విషయాలు చదవొద్దు. రివిజన్ మాత్రమే చేయాలి.
19. పరీక్ష రోజు ప్రశాంతంగా ఉండండి. సమయం కంటే ముందే హాల్‌కు చేరుకోండి. ఇతరులు ఎలా చదివారు, ఎంత చదివారు అనే విషయాలపై చర్చ వద్దు. ప్రశాంతంగా ప్రశ్నపత్రం చదివి సమాధానాలు రాయండి.

- డాక్టర్ పవన్‌కుమార్ కాసు

దిక్సూచి
DIKSUCHI

సమాధానాలు రాసేప్పుడు



1. ప్రశ్నను పూర్తిగా చదవండి. తొందరలో తప్పుగా అర్థం చేసుకోవద్దు. ముఖ్యంగా 'ఎక్స్‌ప్లెయిన్, కంపేర్, డిస్క్రైబ్' వంటి పదాలు గమనించండి.
2. టైమ్ ప్లానింగ్ ముందే చేసుకోండి. చిన్న ప్రశ్నలకు తక్కువ సమయం, దీర్ఘ సమాధానాలకు ఎక్కువ సమయం పక్కాగా పాటించండి. బాగా వచ్చు కదా అని చిన్న ప్రశ్నకు ఎక్కువ సమయం తీసుకుని చివర్లో ఇబ్బంది పడొద్దు.
3. స్పష్టమైన, క్రమబద్ధమైన రాత ముఖ్యం. సమాధానాన్ని పాయింట్స్‌గా రాయండి. ఎక్కువ పేరాలు అన్నట్లు కాకుండా లాజికల్ ఫ్లోలో ఉండేలా చూసుకోండి.
4. ముఖ్యమైన పాయింట్లకు అండర్‌లైన్ చేయండి. ఆయా పదాలను హైలైట్ చేయడం వల్ల పరిశీలకుడు సమాధానం స్పష్టంగా చూడగలుగుతాడు.
5. తగిన డయాగ్రామ్స్, చార్ట్‌లు వాడండి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ, జాగ్రఫీ వంటి సబ్జెక్టులకు సరైన పటాలు, డయాగ్రామ్స్ గీయండి.
6. తప్పులు తగ్గించేందుకు స్పష్టమైన భాష వాడండి. అపరిపక్వమైన పదజాలం, క్లిష్టమైన వ్యాకరణాన్ని ఉపయోగించ వద్దు.
7. లెక్కలు, సైన్స్‌ల్లో స్టెప్ బై స్టెప్ ఆన్సర్ రాయండి. నేరుగా సమాధానం రాయకుండా, ప్రతి స్టెప్ చూపించి రాయడం వల్ల పూర్తి మార్కులు వస్తాయి.
8. మినిమమ్, మాగ్జిమమ్ లిమిట్స్‌లో రాయండి. రెండు మార్కుల ప్రశ్నకు 10 లైన్లు రాయడం, 5 మార్కుల ప్రశ్నకు 3 లైన్లు రాయడం తప్పు. సరిపడే సమాచారం అందించండి.
9. చివర్లో సమాధానాలు చెక్ చేసుకోండి. తప్పులు సవరించుకునేందుకు చివరి 5-10 నిమిషాలు కేటాయించండి.
10. పేపర్‌ను క్లీన్‌గా ఉంచండి. అర్థం కాని రాత, ఎక్కువ సార్లు కొట్టివేతలు, స్క్రిబ్లింగ్ ఉండకుండా చూసుకోవాలి.

ఐఐఎమ్‌లు అందించే ఉచిత కోర్సులు ఇవే

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లు పలు విభాగాలకు సంబంధించిన ఉచిత కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సుల గురించి కేంద్రప్రభుత్వం నిర్వహించే 'స్వయం పోర్టల్' (https://swayam.gov.in/) ద్వారా తెలుసుకోవచ్చు.

బిజినెస్ కమ్యూనికేషన్ ఎసెన్షియల్స్: ఇది ఐఐఎం బెంగళూరు అందించే 6 వారాల కోర్సు. ఉద్యోగ, వ్యాపారాల్లోని సవాళ్లను ఎదుర్కునేలా కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందిస్తారు. 2025 మే 18 నుంచి క్లాసులు మొదలవుతాయి. 2025 ఫిబ్రవరి 28 వరకు నమోదు కావచ్చు.

బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ మార్కెట్స్: రిస్క్ మేనేజ్‌మెంట్‌పై ఐఐఎం బెంగళూరు అందించే ఈ కోర్సు కాలవ్యవధి ఆరు వారాలు. ఎన్‌రోల్‌మెంట్ 2025 ఫిబ్రవరి 28 వరకు చేసుకోవచ్చు.

ఆర్గనైజేషనల్ బిహేవియర్ అడ్వాన్స్‌డ్ టాపిక్స్: ఐఐఎం షిల్లాంగ్ అందించే ఆరు వారాల కోర్సు ఇది. మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపయోగం.

స్ట్రాటజిక్ ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్: ఇది 8 వారాల కోర్సు. ఐఐఎం బెంగళూరు అందిస్తోంది.

వాల్యుయేషన్ అండ్ క్రియేటింగ్ సస్టయినబుల్ వాల్యూ: వాల్యుయేషన్ మెథడ్స్, ఎలా వాల్యుయేషన్ చేయాలో ఉదాహరణలతో సహా వివరిస్తారు. ఐఐఎం బెంగళూరు అందించే ఆరు వారాల కోర్సు ఇది. 2025 ఫిబ్రవరి 28 తేదీ వరకు ఎన్‌రోల్ చేసుకోవచ్చు.

డిజిటల్ మార్కెటింగ్: ఐఐఎం బెంగళూరు నిర్వహించే ఆరు వారాల కోర్సు ఇది. డిజిటల్ ఇన్‌బౌండ్, ఔట్‌బౌండ్ మార్కెటింగ్, లీవరేజింగ్ సోషల్ మీడియా, కస్టమర్ ఇన్‌సైట్స్ తదితరాలు నేర్పిస్తారు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

హెచ్ఆర్ఎం స్ట్రాటజీ ఎగ్జిక్యూషన్: ఐఐఎం అహ్మదాబాద్ నిర్వహిస్తున్న ఆరు వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

డేటా డ్రివెన్ మార్కెటింగ్ డెసిషన్ మేకింగ్: మార్కెటింగ్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని ఐఐఎం విశాఖపట్నం డిజైన్ చేసిన 8 వారాల కోర్సు ఇది. కొనుగోళ్లను ప్రభావితం చేసే అంశాలను బోధిస్తారు.

ఫైనాన్షియల్ అకౌంటింగ్ అండ్ అనాలిసిస్: ఐఐఎం బెంగళూరు డిజైన్ చేసిన కోర్సు. ఫైనాన్షియల్ కాన్సెప్ట్స్, ఫైనాన్షియల్ స్టేట్‌మెంట్స్, అకౌంటింగ్ స్టాండెడ్స్ తదితరాలు ఇందులో ఉంటాయి.

జనరేటివ్ ఏఐ, లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్: ఐఐఎం బెంగళూరు అందించే 8 వారాల కోర్సు. 2025 ఫిబ్రవరి 28 తేదీలోపు నమోదు చేసుకోవాలి.

SCHOLARSHIP ALERT

Ramalingaswami Re-entry

Description: Ramalingaswami Re-entry Fellowship 2024-25 is offered by the Department of Biotechnology, Ministry of Science & Technology, Government of India, to students with relevant PhD/MD degrees or equivalent.
Eligibility: This is open to Indians below 45 years on the application closing date. Applicants must hold a PhD/MD/M.Tech or equivalent degree in specified fields.
Prizes & Rewards: A fellowship of 1,35,000 per month and other benefits. ***Last Date:*** 28-02-2025
Url: www.b4s.in/aj/RFIB2

Quad Fellowship

Description: It is initiated by the governments of Australia, India, Japan, and the US, is administered by the Institute of International Education (IIE).
Eligibility: Open to citizens or legal permanent residents of specific countries including India. Applicants must be at least 18 years of age at the time of application submission and possess a bachelor's degree
Prizes & Rewards: The fellowship offers a one-time stipend of $40,000 and other benefits.
Last Date: 03-03-2025
Url: ww.b4s.in/aj/QUFD1

buddy4study.com

ఆంత్రప్రెన్యూర్ కావడానికీ కోర్సులు ఉన్నాయి

ఉద్యోగాలు చేయడం కాదు, ఉద్యోగాలు ఇచ్చేస్థాయికి ఎదగాలి. 'ఆంత్రప్రెన్యూర్‌షిప్' కరిక్యులమ్‌లో భాగమైతేనే ఇది సాధ్యం. దేశవ్యాప్తంగా విద్యార్థులు, ప్రొఫెషనల్స్‌లో ఆంత్రప్రెన్యూర్ మైండ్‌సెట్ అభివృద్ధి అవుతుందనే ఆలోచనతో హైదరాబాద్ ఐఐటీ 'ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్' స్కూల్‌ను ప్రారంభించింది. అదే బీవీఆర్ సైయెంట్ (బీవీఆర్ స్కూల్ ఆఫ్ ఇన్నోవేషన్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్). భారతదేశంలో ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై ప్రత్యేక స్కూల్ ఇది ఒక్కటే. ఔత్సాహిక పారిశ్రామికవేత్తల సంఖ్యను పెంచడం, అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడం, అవసరమైన వాతావరణాన్ని ఏర్పడరచడం లక్ష్యాలుగా 2024 జనవరిలో దీనిని ఏర్పాటు చేశారు.

- ఇక్కడ ఫార్మల్ డిగ్రీలు కాకుండా ఇన్నోవేషన్, ఆంత్రప్రెన్యూర్‌షిప్‌పై షార్ట్‌టర్మ్ కోర్సులు అందిస్తారు. వీటికి సంబంధించి ఇంజనీరింగ్ వంటి కాలేజీలకు, కార్పొరేట్ సంస్థలకు వెళ్లి అవగాహన కల్పిస్తారు. ఆలోచనలు అవకాశాలుగా, బిజినెస్‌గా ఎలా మలచాలో ఇండస్ట్రీకి చెందిన ప్రముఖులు, ఐఐటీ ఫ్యాకల్టీలు ఇక్కడ శిక్షణ ఇస్తారు. దీనితోపాటు టీహబ్, ఇతర ఇన్నోవేషన్ సెంటర్లతో కలిసి వర్క్ చేస్తున్నారు.

కోర్సులు: ప్రస్తుతం బీవీఆర్ సైయెంట్ కొన్ని కోర్సులను ఆఫర్ చేస్తోంది. 'ప్రొడక్ట్ మేనేజ్‌మెంట్ ఇన్ డిజిటల్ ఎరా' కోర్సు రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. త్వరలో 'డిజిటల్ ఆంటర్ ప్రైజెస్', 'ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ మేనేజ్‌మెంట్ ఫర్ ఆంత్రప్రెన్యూర్స్' తదితర కోర్సులు నిర్వహించనున్నారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాల కోసం బీవీఆర్ సైయెంట్ వెబ్‌సైట్ చూడవచ్చు.



Address: BVR SCIENT, IIT- Kandi, Sangareddy, Telangana– 502284 **Mobile:** +91 9160006190, https://bvrscient.iith.ac.in/

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

కర్మఫలం నేపథ్యంలో..



అను ఇమ్మాన్యుయేల్, శివ కందుకూరి ప్రధాన పాత్రల్లో ఆంద్రూ బాబు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బూమరాంగ్'. లండన్ గణేశ్, డాక్టర్ ప్రవీణ్ రెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలోని 'గ్లింప్స్'ని చిత్ర బృందం లాంచ్ చేసింది. ఈ సందర్భంగా శివ కందుకూరి మాట్లాడుతూ 'ఈ సినిమాలో ఒక డార్క్ సైడ్ ఉంది. కచ్చితంగా ఇది డిఫరెంట్ మూవీ అవుతుంది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు ఆంద్రూ బాబు మాట్లాడుతూ 'కరోనా సమయంలో చాలా కథలు రాశాను. అందులోంచి ఎంపిక చేసిన మొదటి కథ 'బూమరాంగ్'. ఇది మెసేజ్ ఓరియెంటెడ్ సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రం' అని తెలిపారు. నిర్మాత ప్రవీణ్‌రెడ్డి మాట్లాడుతూ 'అవుట్ పుట్ అద్భుతంగా వచ్చింది. మీ అందరి సపోర్ట్ కావాలి' అని కోరారు. సవాలు విసిరే కథ ఇది. శివ కందుకూరి మంచి నటుడు. భిన్నమైన కథలు చేస్తున్నారు' అని ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ కె.ఎల్. దామోదర ప్రసాద్ అన్నారు.

శబ్దం ఒక అద్భుతం



నాని

"హారర్ సినిమా చూసినా కళ్లు చెమ్మగిల్లుతాయని నేను ఎప్పుడూ అనుకోలేదు. మంచి కథతో పాటు భావోద్వేగాలు ఉన్న చిత్రం 'శబ్దం'. ఈ సినిమా నేను చూశాను. అద్భుతంగా ఉంది" అని నాని అన్నారు. ఆది పినిశెట్టి కథానాయకుడిగా, అరివళగన్ దర్శకత్వంలో శివ నిర్మించిన చిత్రమిది. సిమ్రాన్ లైలా, లక్ష్మీ మీనన్ కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా యూనిట్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ముఖ్య అతిథిగా హాజరైన నాని మాట్లాడుతూ 'ఉపయోగించుకోవాలే కానీ సౌండ్ కూడా ఒక ఆయుధం అవుతుందనే అంశాన్ని 'శబ్దం' చిత్రంలో అద్భుతంగా చూపారు' అని ప్రశంసించారు. ఆది పినిశెట్టి మాట్లాడుతూ 'వైశాలి నా కెరీర్‌లో స్పెషల్ మూవీ. ఇప్పుడు శబ్దం కూడా నాకు స్పెషల్ మూవీ అవ్వాలని కోరుకుంటున్నాను' అన్నారు. తమన్ తన సంగీతంతో సినిమాకు ప్రాణం పోశాడని అరివళగన్ చెప్పారు.



అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది

సందీప్ కిషన్

సందీప్ కిషన్, రీతూ వర్మ, అన్షు ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మజాకా'. త్రినాథ రావు నక్కిన దర్శకత్వంలో రాజేశ్ దండా, ఉమేశ్ కెఆర్ బన్సల్ నిర్మించారు. ఈనెల 26న విడుదలవుతోంది. తాజాగా ఈ చిత్రం ట్రైలర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ 'నా కెరీర్‌లో హయ్యస్ట్ నెంబర్స్‌ని ఈ సినిమా ఇస్తుంది. థియేటర్‌లో కుటుంబసమేతంగా చూసే చిత్రమిది. రావు రమేశ్ అద్భుతంగా నటించారు. ఆయన వల్ల కథ మరింత పండింది' అని చెప్పారు. చిత్ర దర్శకుడు త్రినాథరావు మాట్లాడుతూ 'నేను ప్రతి సీన్‌లో మ్యాజిక్ ఉండాలని నమ్ముతాను. నా ప్రతి సినిమాలో కూడా మ్యాజిక్ జరుగుతుంది. ఇందులో కూడా ఓ మ్యాజిక్ ఉంది. శివరాత్రి నాడు డబుల్ మ్యాజిక్ జరుగుతుంది. డబుల్ బ్లాక్ బస్టర్ అవుతుంది' అని తెలిపారు. రావు రమేశ్ మాట్లాడుతూ 'ఇలాంటి సినిమా చేయడం నాకు కొత్తే. ఇందులో రొమాంటిక్‌గా నటించడం చాలా సవాల్‌గా అనిపించింది. ఒక ఎమోషనల్ సీన్ ఉంది. అది ఐకానిక్‌గా నిలిచిపోతుంది' అని అన్నారు. హీరోయిన్ రీతూ వర్మ మాట్లాడుతూ 'ఈ సినిమాని ప్రేక్షకులు తప్పకుండా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు. నిర్మాత రాజేశ్ దండా మాట్లాడుతూ' ప్రతి ఒక్కరికీ ఈ సినిమా నచ్చుతుంది. రీతు వర్మ డ్యాన్స్ అదరగొట్టింది' అని అన్నారు.

మాఫియాతో పోలీస్ పోరాటం



సంఘ విద్రోహ శక్తుల ఆటకట్టించే పోలీసాఫీసర్ కథతో తెరకెక్కుతోన్న చిత్రం 'విద్రోహి'. రవి ప్రకాశ్ ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. వీఎస్‌వీ దర్శకత్వంలో వీ వెంకట సుబ్రహ్మణ్యం, పీ కనకదుర్గారావు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను నటుడు శ్రీకాంత్ చేతుల మీదుగా యూనిట్ విడుదల చేసింది. రవి ప్రకాశ్ మాట్లాడుతూ 'ఇదొక సస్పెన్స్ థ్రిల్లర్. కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను థ్రిల్ చేస్తాయి. దర్శకుడిగా వీఎస్‌వీకి పేరు తెస్తుంది' అన్నారు. ఒక తెలివైన పోలీసు మాఫియాను మట్టుబెట్టిన తీరు ప్రేక్షకులను అలరిస్తుందని నిర్మాతలు చెప్పారు. సంగీతం: భీమ్స్ సిసిరోలియో, సినిమాటోగ్రఫీ: సతీశ్ ముత్యాల.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల సందర్శన


పసుపు పంటను పరిశీలిస్తున్న అమెరికాకు చెందిన కీత్ అగోడా

గుంటూరు సిటీ, కొల్లిపర, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): అమెరికాకు చెందిన సుప్రసిద్ధ ప్రొడ్యూసర్స్ ట్రస్ట్ సీఈవో కీత్ అగోడా, వ్యవసాయ రంగంలో పేరొందిన ప్రముఖ యూరోపియన్ వ్యాపారవేత్త, ప్రధాన పంపిణీదారు ప్యాట్రిక్ స్ట్రూబీ ఆదివారం గుంటూరు జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రైతు సాధికార సంస్థ నిర్వహించింది. తొలుత గుంటూరులోని జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మేనేజర్ కె.రాజకుమారి పలు విషయాలను విదేశీ ప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. జిల్లా స్థాయిలో సిబ్బంది నిర్మాణం, ప్రకృతి వ్యవసాయ 9 సార్వత్రిక సూత్రాలను ఆమె విదేశీ ప్రతినిధులకు వివరించారు. అనంతరం కొల్లిపర మండలం దావులూరిపాలెం గ్రామంలో పర్యటించి ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. బీజామృతం, ఘనజీవామృతం, ద్రవజీవామృతం, విత్తన గుళికెల తయారీ విధానాలను ప్రత్యక్షంగా చూశారు. గ్రామానికి చెందిన వసంత కుమారి వ్యవసాయ క్షేత్రంలో ఏ-గ్రేడ్ అరటి తోటలను, ఎనీ టైం మనీ మోడల్‌ల ను సందర్శించారు. వివిధ పద్ధతుల్లో సాగుచేసే అరటి తోటలను పరిశీలించారు. విత్తన దశ నుంచి పూర్తి స్థాయిలో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అనుసరించే రైతు కన్నయ్య, సి.రామారావు వ్యవసాయ క్షేత్రాలతోపాటు రసాయన వ్యవసాయం చేసే టి.బాబు పొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ రసాయన వ్యవసాయంతో పోల్చితే ప్రకృతి వ్యవసాయంలో మట్టి పూర్తిగా భిన్నంగా ఉందన్నారు. ప్రకృతి వ్యవసాయ మట్టి నిర్మాణం ప్రశంసనీయం అన్నారు. కార్యక్రమంలో హార్టీకల్చర్ అదనపు డైరెక్టర్ డాక్టర్ సీబీ హరినాథ్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయాధికారులు శ్రీలక్ష్మి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో చంద్రికకు మూడు పతకాలు



సీనియర్స్ విభాగంలో బరువును ఎత్తుతున్న చంద్రిక

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పవర్ లిఫ్టింగ్ ఇండియా ఆధ్వర్యంలో పంజాబ్ రాష్ట్రంలో ఈ నెల 20వ తేదీ నుంచి మూడు రోజులపాటు జరిగిన సీనియర్ నేషనల్ క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన బొల్లినేని చంద్రిక సత్తా చాటింది. 84 కిలోలు పైబడిన విభాగంలో అద్భుతంగా రాణించి మూడు పతకాలను సాధించిందని పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొమ్మాకుల విజయ భాస్కరరావు, షేక్ సంధాని తెలిపారు. స్క్వాట్‌లో బంగారు పతకం, డెడ్‌లిఫ్ట్‌లో కాంస్య పతకంతోపాటు ఓవరాల్‌గా కాంస్య పతకం సాధించినట్టు చెప్పారు. పతకాలు సాధించిన చంద్రిక, ఆమె కోచ్ నరేంద్రరాజులను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గంటా వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సకల సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు మద్ది ప్రభాకర్‌రావు, జిల్లా వైస్ చైర్మన్ ఆర్ఎన్ వంశీకృష్ణ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో బాలుడు మృతి చెందిన సంఘటన చిలకలూరిపేట మండలంలో ఆదివారం జరిగింది. చిలకలూరిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోపాలంవారిపాలెం గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మోటార్ బైక్‌పై సమీపంలోని రాజాపేటలో జరుగుతున్న ప్రార్థనా కూటములకు హాజరయ్యేందుకు బయలుదేరారు. దారి మధ్యలో ఒక లారీని దాటి ముందుకు వెళ్లే క్రమంలో ఎదురుగా వచ్చిన బైకుకు వీరి బైక్ ఢీకొంది. ఈ ప్రమాదంలో గోపాలవారిపాలెం గ్రామానికి చెందిన కాకర్లమూడి విజయ్ (13) అనే బాలుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం చేయించి బంధువులకు పోలీసులు అప్పగించారు. తండ్రి నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మోసాలకు అడ్డుకట్ట!

- మిర్చియార్డులో ఇంటిగ్రేటెడ్ కాటాల ఏర్పాటు
- మార్కెటింగ్ శాఖకు సీఎం ఆదేశం
- కొద్ది రోజుల్లో ప్రొక్యూర్‌మెంట్ చేయనున్న అధికారులు

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డులో కాటాలలో జరుగుతోన్న మోసాలకు అడ్డుకట్ట వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానం కలిగిన సమీకృత కాటాలను అమర్చాలని సీఎం చంద్రబాబు నాయుడు మార్కెటింగ్ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కాటాల వలన తూకం వేసిన వెంటనే మిర్చి తీసుకొచ్చిన రైతు, అమ్మిపెట్టిన కమీషన్ వ్యాపారి, కొనుగోలు చేసిన ఎగుమతిదారుడికి ఏకకాలంలో ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం చేరుతుంది. అలానే గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి కూడా ఆ వివరాలు చేరతాయి. దాంతో కాటాలలో పారదర్శకత వస్తుందని భావిస్తున్నారు. వీటిని సమకూర్చుకోవడం కొంచెం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం అయినప్పటికీ రైతుల ప్రయోజనం దృష్ట్యా ఏర్పాటు చేయాల్సిందేనని ముఖ్యమంత్రి ఆదేశించారు.

రైతు నష్ట పోవాల్సి వస్తుంది..

రైతులు గుంటూరు మిర్చియార్డుకు మిరప కాయలను అమ్ముకోవడానికి తీసుకొచ్చే ముందు మిర్చి కళ్లాలు, వేబ్రిడ్జీల వద్ద తూకం వేయిస్తున్నారు. అయితే యార్డులో సరుకు దిగుమతి జరిగి, కొనుగోళ్లు పూర్తి అయ్యాక వేసే కాటాలో తరుగు ఉంటుంది. దీనివలన రైతు నష్టపోవాల్సి వస్తుంది. ఇందుకు కారణం మిర్చి టిక్కీలను తెరిచి కొంతమంది మిరపకాయలను తస్కరిస్తున్నారు. అలానే హమాలీలు మచ్చుకాయలు తీస్తున్నారు. కొందరైతే మచ్చుకాయల పేరుతో కేజీలకు కేజీలు తీసుకొంటున్నారు. ఇవన్నీ యార్డు నుంచి బయటకు తరలించి సొమ్ము చేసుకొంటూ రైతుకు నష్టం వాటిల్లేలా చేస్తున్నారు. కాటాలలో మోసాలు జరుగుతున్నాయని రైతులు గత కొన్నేళ్లుగా ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారు.

కమీషన్ దుకాణాల్లోనే..

మిర్చియార్డు పర్సన్ ఇన్‌చార్జిగా డాక్టర్ చెరుకూరి శ్రీధర్ ఉన్న సమయంలో వైఫై సదుపాయం కలిగిన ఎలక్ట్రానిక్ కాటాలను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేశారు. అయితే వాటిని కొన్ని నెలలు మాత్రమే వినియోగించి రిపేర్లు వచ్చాయని మూలన పడేశారు. దాంతో మార్కెట్ కమిటీ నష్టపోయింది. ఈ కారణం వలన తిరిగి కమీషన్ దుకాణాలలో ఏర్పాటు చేసిన కాటాలనే వినియోగిస్తున్నారు. మార్కెట్ కమిటీ నియమించిన వేమెన్‌లు ప్రతి షాపు వద్దకు వెళ్లి కాటాలను నిశితంగా పరిశీలించి గేట్‌పాసు మంజూరు చేయాల్సి ఉండగా యార్డులో అలా జరగడం లేదు. వ్యాపారస్తుల గుమాస్తాలు వేమెన్‌ల అసోసియేషన్ల వద్దకు వెళ్లి కాటాలు వేశామని చెప్పి గేట్‌పాసులు తీసుకొంటున్నారు. ఈ నేపథ్యంలో సమీకృత కాటాల వలన ఇలాంటి అసంబద్ధమైన విధానాలకు అడ్డుకట్ట పడుతుందని అధికారులు చెబుతున్నారు. మార్కెటింగ్ శాఖ నుంచి ఆదేశాలు రాగానే ఇంటిగ్రేటెడ్ కాటాలను కొనుగోలు చేస్తామని అధికారులు తెలిపారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థికే మద్దతు

- ఏపీటీఎఫ్ నాయకుల ప్రకటన
- నైతిక బలాన్ని ఇచ్చింది: ఆలపాటి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె. బసవలింగారావు, మహమ్మద్ ఖలీద్ ప్రకటించారు. జిల్లా కోర్టు రోడ్డులోని ఏపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో సంఘ నాయకులు మాట్లాడారు. ఉత్తరాంధ్ర ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రఘువర్మకు కూటమి మద్దతు ప్రకటించిన నేపథ్యంలో ఇక్కడ ఆలపాటికే ఏపీటీఎఫ్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. ఏపీటీఎఫ్ శ్రేణులు రాబోయే మూడు రోజులు వ్యూహాత్మకంగా పనిచేసి ఏపీటీఎఫ్ మద్దతు ఇచ్చిన ఆలపాటి రాజేంద్రప్రసాద్ భారీ మెజారిటీతో గెలిచేటట్లు పనిచేయాలని కోరారు. గత పాలనలో ఉపాధ్యాయులు ఆత్మగౌరవం కోసం పోరాటం చేశామని, ఉపాధ్యాయ, ఉద్యోగులను కనీసం ఓటర్లుగా పాలకులు చూడలేదన్నారు. ఇప్పుడున్న కూటమి ప్రభుత్వం అయినా ఉపాధ్యాయుల, ఉద్యోగుల ఆకాంక్షలు నెరవేర్చాలని స్పష్టం చేశారు.

ప్రభుత్వంపై మరింత బాధ్యత పెరిగింది..

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం గత 78 ఏళ్ల నుంచి విద్యారంగ ప్రగతికి, ఉపాధ్యాయ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందనీ, అలాంటి ఉద్యమ సంస్థ కూటమి అభ్యర్థినైన తనకు మద్దతు ఇవ్వడం నైతిక బలాన్ని ఇచ్చిందన్నారు. ప్రధాన ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి మద్దతు ఇవ్వడం వలన ప్రభుత్వంపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. గతంలో చంద్రబాబు 43 శాతం ఫిట్మెంట్ ఇచ్చి జీతాలు పెంచారన్నారు. ఇప్పుడు కూడా ఉపాధ్యాయ, ఉద్యోగులకు ఎలా మేలు చేయాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తుందన్నారు. సమావేశంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా శాఖల ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఖాలీద్, వి.వి.రవికుమార్, పి. డి. సోషలిజం, గుంటూరు జిల్లా కమిటీ నాయకులు పి.నాగశివన్నారాయణ, పార్వతి, సత్యనారాయణ మూర్తి, లక్ష్మీనారాయణ, జనార్దన్, రమేష్, శంకర్, ఎన్ఆర్ఐ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పిడికిటి తిలక్ బాబు, ఏపీటీఎఫ్ పూర్వ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిలు రాజారత్నం, హనుమంతరావు పాల్గొన్నారు.

కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులకు జేబీఏసీ మద్దతు

పొన్నూరుటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థులకు జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ మద్దతు తెలుపుతున్నట్లు ఆ సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ మోసిగంటి జోసెఫ్ ఆదివారం తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో కూటమి అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలన్నారు. టీడీపీ కూటమితోనే క్రైస్తవ సమాజానికి మేలు జరుగుతుందన్నారు. వైసీపీ, టీడీపీ ప్రభుత్వాల పని తీరును గమనిస్తే విషయం స్పష్టం అవుతుందన్నారు. ఉమ్మడి గోదావరి జిల్లాల అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్, కృష్ణా, గుంటూరు జిల్లాల అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌లను గెలిపించాలని జోసెఫ్ మోసిగంటి క్రైస్తవ సమాజానికి విజ్ఞప్తి చేశారు.

ప్రశాంతంగా గ్రూపు-2 మెయిన్ పరీక్షలు


- పేపర్-1 పరీక్షకు 85.45 శాతం మంది హాజరు
- పేపర్-2కి 85.37 శాతం మంది


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

గుంటూరు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఏపీపీఎస్సీ గ్రూపు-2 మెయిన్స్ పరీక్షలు జిల్లాలో ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 11 పరీక్ష కేంద్రాల్లో ఉదయం, మధ్యాహ్నం అభ్యర్థులు పేపర్-1, 2 పరీక్షలను రాశారు. ఎక్కడా ఎలాంటి మాల్ ప్రాక్టీసు జరగలేదని ఏపీపీఎస్సీ, రెవెన్యూ అధికారులు తెలిపారు. ఉదయం పరీక్షకు గ్రేస్ పీరియడ్ కలుపుకొని 9.45 గంటల వరకు అభ్యర్థులను లోనికి అనుమతించారు. ఒరిజినల్ ఐడీ, హాల్ టిక్కెట్ ఉన్న అభ్యర్థులనే పోలీసులు తనిఖీ చేసి పంపించారు. ఏపీపీఎస్సీ విజ్ఞప్తి మేరకు పరీక్ష కేంద్రాలు ఉన్న మార్గాల్లోకి ఏపీఎస్ఆర్టీసీ, సిటీ బస్సులను నడిపారు. మొత్తం 9,277 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ఉదయం జరిగిన పేపర్-1కు 7,927 మంది వచ్చారు. 1350 మంది గైర్హాజరైనట్లు అధికారులు తెలిపారు. దీంతో ఉదయం పరీక్షకు హాజరు శాతం 85.45గా నమోదైంది. మధ్యాహ్నం 3 గంటలకు జరిగిన పేపర్-2 పరీక్షకు 7.920 మంది మాత్రమే హాజరయ్యారు. దీంతో హాజరు శాతం 85.37గా నమోదైంది. పరీక్షలు జరుగుతున్న కేంద్రాలను జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ ఏపీపీఎస్సీ అధికారులతో కలిసి సందర్శించారు. తాగునీరు, వైద్య సదుపాయాలను పరీక్షా కేంద్రాల వద్ద పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా చూసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు.

1.40 లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తాం


- పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు(విద్య), ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): 1.40 లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామనీ, ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల అభివృద్ధికి కృషి చేయడంతోపాటు ఆయా జిల్లాల్లో ఉన్న ప్రధాన సమస్యలు పరిష్కరిస్తామని ప్రొగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పీడీఎఫ్) ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. ఈ నెల 27న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తొలి ప్రాధాన్య ఓటు తనకు వేయాలని ఆయన పట్టభద్రులను అభ్యర్థించారు. ఆదివారం గుంటూరులోని యూటీఎఫ్ హాలులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం తప్పా ఆచరణలో అమలు కావడం లేదనీ, ఎన్ని పోస్టులు భర్తీ చేస్తారో స్పష్టంగా చెప్పడం లేదన్నారు. పెన్షనర్లుకు ఫిట్‌మెంట్ ప్రకటించాల్సి ఉందన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ కార్యకర్తలు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని ఆయా సమస్యలు మండలిలో ప్రస్తావించి పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పీడీఎఫ్ ఎమ్మెల్సీలు రాజ్యాంగ విలువలకు కట్టుబడి 18 ఏళ్లుగా నీతి నిజాయితీతో పనిచేస్తున్నారని అన్నారు. వినతి పత్రాలు ఇచ్చే సమయంలో తన వద్ద ఉన్న పేపర్లు కింద పడిపోయాయనీ, వాటిని తీసుకునే ప్రయత్నంలో తాను కిందకు వంగాననీ, దీనిని సామాజిక మాధ్యమాల్లో కాళ్లకు మొక్కుతున్నట్లు అసత్య ప్రచారం చేయడంపై నిరసన వ్యక్తం చేశారు. సమావేశంలో జనచైతన్య వేదిక అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు, యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల విభాగం చైర్మన్ ఎం.హనుమంతరావు, కె.సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరూ కలిసి పని చేయండి

- బొల్లా వ్యతిరేక వర్గానికి వైవీ సూచన


వైవీని కలిసిన బొల్లా వ్యతిరేక వర్గం

వినుకొండటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడుకు వ్యతిరేకంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వైసీపీలోని బొల్లా వ్యతిరేక వర్గానికి చెందిన నాయకులు మూకుమ్మడిగా తాడేపల్లి ప్యాలెస్ సమీపంలోని వైవీ సుబ్బారెడ్డి నివాస గృహంలో వైవీని కలిశారు. బొల్లాతో కలిసి పని చేసేది లేదనీ, చుండూరి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పని చేయడానికి మేమంతా సిద్ధమైనట్లు వైవీకి తేల్చి చెప్పారు. సొంతగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకొని పార్టీ కోసం పనిచేస్తామని, ఈ విషయాన్ని జగన్ దృష్టికి తీసుకెళ్లి వినుకొండ సమన్వయకర్తను మార్చాలని వైవీ వద్ద ప్రతిపాదించారు. అనంతరం వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ అంత సులువుగా తీసుకునే నిర్ణయం కాదనీ, జగన్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపినట్లు సమాచారం. ప్రత్యేకంగా పార్టీ కార్యాలయం ఏర్పాటు చేస్తామని, దీనికి పార్టీ అనుమతి ఇప్పించాలని కోరడంతో వినుకొండలో ప్రత్యేక కార్యాలయాన్ని ఏర్పాటు చేసినప్పటికీ అందరూ కలిసి పనిచేయాలని వైవీ సూచించినట్లు అసమ్మతి నేతలు తెలిపారు. శావల్యాపురం వైసీపీ సీనియర్ నాయకులు చుండూరి వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గోనుగుంట్ల వెంకటహనుమయ్య, శాకమూరి బుచ్చయ్య, నక్కా నాగిరెడ్డి, పారా వెంకటేశ్వర్లు, నరాలశెట్టి శ్రీను, బాబు, పీకేరావు, వెంకటేశ్వరరెడ్డి, స్వెనోమ్‌తో పాటు సుమారు వందమంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా సాగరమాత పతాకావిష్కరణ


పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పీఠాధిపతి భాగ్యయ్య

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విజయపురి సౌత్ సాగరమాత ఆలయంలో ఆదివారం గుంటూరు పీఠాధిపతి డాక్టర్ చిన్నాబత్తిని భాగ్యయ్య చేతుల మీదుగా సాగరమాత పతాకావిష్కరణ ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆలయంలో నవదిన జపములు, దివ్య బలిపూజలను నిర్వహించారు. ఆలయం చుట్టూ తేరు ప్రదక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి భాగ్యయ్య మాట్లాడుతూ మార్చి 7 నుంచి 9వ తేదీ వరకు సాగరమాత ఉత్సవాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. అలాగే ఈ నెల 26 నుంచి మార్చి 6వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం 5:30 గంటల నుంచి నవదిన జపములు, దివ్యబలిపూజ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో సాగరమాత ఆలయ విచారణ గురువులు జోసఫ్ బాలసాగర్, ఫాదర్ అన్నెం జోసఫ్‌తంబి, ఆలయ పెద్దలు దుగ్గెంపూడి ఇన్నారెడ్డి, జక్కిరెడ్డి చిన్నపరెడ్డి, శౌరిరాజు, ఆలేటి మరియదాసు తదితరులు పాల్గొన్నారు.

15 మంది సిబ్బందికి మెమోలు


గురుకుల పాఠశాలలో సిబ్బందితో మాట్లాడుతున్న పద్మజ

రేపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న 15 మంది సిబ్బందికి మెమోలు జారీ చేశామనీ, ప్రిన్సిపాల్ గిరిజా కుమారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా కోఆర్డినేటర్ పద్మజ వెల్లడించారు. ఆదివారం పట్టణంలోని 2వ వార్డులో గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. వంట గదులు, మరుగుదొడ్ల పరిసరాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో మాట్లాడుతూ ప్రిన్సిపాల్ గిరిజాకుమారి, ఉపాధ్యాయినుల మధ్య తరచూ విభేదాలు వస్తున్నాయనీ, వీటిని పరిష్కరించుకోవాలని ఆదేశించినా పట్టించుకోవడంలేదన్నారు. స్వయాన సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి దగ్గర ఉండి మరుగుదొడ్లు శుభ్రం చేయించే పరిస్థితి ఉందంటే వీరి పనితీరు ఎలా ఉందో అర్థమౌతుందన్నారు. లక్షల జీతాలు తీసుకుంటున్నారే తప్పా బాధ్యతగా విధులు నిర్వహించటంలేదని అన్నారు. వీరి కారణంగా విద్యార్థులు బలైపోతున్నారన్నారు. ఆహార విషయంలో కూడా నాణ్యత పాటించటంలో విఫలం చెందారన్నారు. వీటన్నింటిపై ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు తెలిపారు. మెమోలపై వివరణ ఇచ్చిన అనంతరం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాఖా పరమైన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

రేపల్లె, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సముద్రంలో వేటకు వెళ్లి వల వేస్తుండగా ప్రమాదవశాత్తూ జారిపడి వలలో చిక్కుకొని మత్స్యకారుడు చిప్పల బాబూరావు(39)మృతి చెందాడు. నిజాంపట్నం మండలం కొత్తపాలెం సముద్రంలో శనివారం భార్యాభర్తలైన బాబూరావు, రాఘవమ్మ చేపల వేటకు వెళ్లారు. వల విసురుతుండగా సముద్రంలో జారిపడి వలలో చిక్కుకొని మృతి చెందాడని ప్రత్యక్ష సాక్షి, భార్య రాఘవమ్మ తెలిపింది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. అడవులదీవి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, నిజాంపట్నం ఇన్‌చార్జ్ ఎస్ఐ తిరుపతిరావు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.65
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	87, 99,108
చికెన్ విత్ స్కిన్	172.00
చికెన్ స్కిన్ లెస్	182.00

పులిచింతల సమాచారం

అచ్చంపేట, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పులిచింతల ప్రాజెక్టులో ఆదివారం 30.93 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. లీకుల ద్వారా మూడు వందల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుందని రాజు తెలిపారు.

గాయత్రి మహాయజ్ఞం

మాచర్లటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జమ్మలమడక గ్రామ సమీపంలో గల కురుమామిళ్లమ్మ ఆలయ ఆవరణలో ఆదివారం అఖిల విశ్వగాయత్రి పరివార్ శాంతికుంజ్ హరిద్వార్ ఆధ్వర్యాన గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో ఈ మహాయజ్ఞంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కాలంగి నాగేశ్వరరావు, సోమిశెట్టి రామకృష్ణ, బచ్చు శ్రీనివాసరావు, మండవ శివకోటేశ్వరరావు, బచ్చు నాగరాజు, కంభంపాటి మల్లికార్జునరావు, హనుమంతురావు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్ బోల్తా

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న గేదెలను తప్పించబోయిన వాటర్ ట్యాంకర్ బోల్తా పడిన ఘటన మండలంలోని భైరవునిపాడు వద్ద ఆదివారం చోటుచేసుకుంది. మాచర్ల పట్టణంలో నీటిని నింపుకున్న వాటర్ ట్యాంకర్ మండలంలోని ఏడో మైలుకు వెళ్తుండగా మార్గ మధ్యంలోని భైరవునిపాడు సమీపంలోకి రాగానే ఎదురుగా గేదెలు రావడంతో, డ్రైవరు వాటిని తప్పించే ప్రయత్నంలో ట్యాంకరు అదుపు తప్పి రోడ్డుపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురక్షితంగా బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్యాంకరును క్రేన్ సాయంతో పక్కకు తొలగించారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

మాచర్ల రూరల్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అలుగురాజుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో ఈనెల 26వ తేదీన మహా శివరాత్రిని పురస్కరించుకొని త్రైత సిద్ధాంతం - ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యాన త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం నిర్వహించారు. శివరాత్రి పండుగ విశిష్టతను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కటికం సైదారావు, యద్దనపూడి వీరాంజనేయులు, అరుణ, కార్తీక్, నారాయణమ్మ, అనురాధ, వెంకటలక్ష్మి, శ్రీను, వీరయ్య, రాఘవ, సుందరం, రామాంజనేయులు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ప్రచారం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 27న జరగనున్న కృష్ణా, గుంటూరు జిల్లాల పట్ట భద్రుల ఎంఎల్‌సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదును గెలిపించాలని కోరుతూ టీడీపీకి చెందిన న్యాయవాదులు ఆదివారం రాత్రి పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం చేశారు. ఉపాధ్యాయులను, పట్ట భద్రులను కలసి ఆలపాటికి ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో బాపయ్య చౌదరి, అనుమోలు జయరామ్, బత్తుల ఆదినారాయణ, వీర భాస్కర్‌రెడ్డి, బీఎల్ చిన్నయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్ టెస్టు విజేతలకు బహుమతులు అందజేత

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, నరసరావుపేట వారి ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని వాసవి కల్యాణ మండపంలో నిర్వహించిన స్కాలర్‌షిప్ టెస్టుకు పల్నాడు జిల్లా వ్యాప్తంగా 382 మంది పదవ తరగతి విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో కారంపూడిలోని రెయిన్‌బో స్కూల్‌కు చెందిన హారిక ప్రథమ స్థానంలో నిలిచి 10 వేల రూపాయల నగదు పారితోషికాన్ని విట్ డైరెక్టర్ కెఎస్‌ఆర్, డీన్ మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. దాచేపల్లిలోని మదర్‌థెరిస్సా స్కూల్‌కు చెందిన శివరంజని రెండో బహుమతి సాధించగా, పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి జడ్‌పి హైస్కూల్‌కు చెందిన కె హేమంత్‌కుమార్, యేలూరి వెంకట శ్రీనివాసరావులు మూడవ బహుమతిని గెలుచుకున్నారు. మరో 18 మందికి కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. విట్ డైరెక్టర్లు కెఎస్‌ఆర్, దోగిపర్తి శ్రీనివాసరావులు మాట్లాడుతూ ఇంటర్మీడియట్‌లోకి ప్రవేశించే విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ రంగారావు, ప్రిన్సిపాల్ రాఘవ, కె వెంకటరావు, అంజినాయక్, శంకర్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్యవేదిక హెచ్చార్పీ

జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాసరావు

కారంపూడి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా చైతన్య వేదిక హ్యూమన్ రైట్స్ ప్రొటక్షన్ జిల్లా అధ్యక్షుడిగా కారంపూడి పట్టణానికి చెందిన నూనె శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. ఈ మేరకు ఆదివారం ప్రకాశం జిల్లా గిద్దలూరులో వేదిక వ్యవస్థాపకుడు మదిరి రంగసాయిరెడ్డి చేతుల మీదుగా శ్రీనివాస్ నియామక పత్రం అందుకున్నారు.

భక్తులకు అన్నివిధాలా ఏర్పాట్లు

● సామాన్య భక్తుడికి సర్వ దర్శనం
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి
● సత్రశాల ఆలయంలో శివరాత్రి ఏర్పాట్ల పరిశీలన

రెంటచింతల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పల్నాట ప్రముఖ శైవక్షేత్రం కృష్ణానది ఒడ్డున గత సత్రశాలలోని శ్రీగంగాభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో బుధవారం నిర్వహించే మహాశివరాత్రికి ఆధ్యాత్మికత పరిడవిల్లేలా ఏర్పాట్లుచేయాలని ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు వుండడానికి వీల్లేదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశించారు. ఆదివారం మూడవసారి ఆయన సత్రశాలకు వచ్చారు. అక్కడి అధికారులు, సిబ్బంది చేస్తున్న ఏర్పాట్లపై సంతృప్తిని వ్యక్తం చేశారు. ఇనుప బారికేడ్ల బయట టెంట్లు వేయాలని, సామాన్య భక్తునికి సైతం సర్వదర్శనం కల్పించేలా చూడాలన్నారు. బస్సులు ఆగే స్థలంలో రహదారికి ఇరువైపులా గ్రావెల్‌తో రహదారి విస్తరణ చేపట్టాలన్నారు. జల్లు స్నానం ఏర్పాట్లు, విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. మంచినీరు, విద్యుత్ సరఫరాకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, గజ ఈతగాళ్లు, స్వామి వారి కళ్యాణం తదితర విషయాలపై ఎండోమెంట్ ఈవో గాదే రామిరెడ్డితో ఎమ్మెల్యే మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. 26వ తేదీన తాను ఎక్కువ సేపు సత్రశాల స్వామి వారి సన్నిధిలోనే ఉంటానని, భక్తులకు ఏ ఇబ్బంది తలెత్తకుండా ఏర్పాట్లు చేద్దామని ఏవోతో అన్నారు. కార్యక్రమంలో ప్రభురాజ్, గుండా శివయ్య, లింగయ్య, నీలం మల్లయ్య, గొట్టం శ్రీనివాసరెడ్డిలతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, బోడపాటి రామకృష్ణ, ఎం.రాయపరెడ్డి, మందలపు హనిమిరెడ్డి, అల్లం బ్రహ్మారెడ్డి, తేలుకుట్ల కోటిరెడ్డి, ఎం.శౌరైడ్డి, సిద్దయ్య, గోగుల వెంకట్రామిరెడ్డి, డి.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సత్రశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి

జగన్ అసెంబ్లీకి వస్తే మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తాం ..

ఎమ్మెల్యేగా జగన్‌మోహనరెడ్డి అసెంబ్లీకి వస్తే మనస్ఫూర్తిగా స్వాగతిస్తామని, దీంతో ఆయన పులివెందుల నియోజకవర్గ ఓటర్ల తీర్పును గౌరవించినవారవుతారని, విపక్షనేత పదవి ప్రజలు ఇచ్చే తీర్పని, ప్రభుత్వం ఇచ్చేది కాదన్న వాస్తవాన్ని జగన్ గ్రహించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. ఆదివారం సత్రశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జగన్ 5 ఏళ్ల ఘన కార్యాలపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని, ప్రజాస్వామ్యంలో ఎవరైనా ప్రజా తీర్పును శిరసావహించాల్సిందేనన్నారు. ప్రజల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి కోసం అహరహం కష్టపడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని చూసి జగన్ నేర్చుకోవాల్సింది ఎంతో ఉందన్నారు. ప్రచార పిచ్చిలో పడి, ప్రజా ప్రతినిధినన్న విషయాన్ని మరిచి జగన్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను సైతం ఉల్లంఘించారని ఎమ్మెల్యే జూలకంటి మండిపడ్డారు.

ఫ్యాక్టరీ దుమ్ముతో పంటలు నష్టపోతున్నాం


ఆందోళన వ్యక్తం చేస్తున్న తక్కెళ్ళపాడు రైతులు

● తక్కెళ్ళపాడు గ్రామ రైతుల ఆందోళన

దాచేపల్లి, ఫిబ్రవరి 22 (ఆంధ్రజ్యోతి) : సిమెంట్ ఫ్యాక్టరీ దుమ్ము పొలాలపై పేరుకు పోవడంతో పంట దిగుబడులు తగ్గిపోయి ఆర్థికంగా నష్ట పోతున్నామని తక్కెళ్ళపాడు గ్రామ రైతులు ఆదివారం ఆందోళన వ్యక్తంచేశారు. దాచేపల్లి మండలం పెదగార్లపాడు గ్రామ సమీపంలోని శెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ నుంచి వెలువడే దుమ్ము పరిసర ప్రాంతాల్లోని మిర్చి పొలాలపై వచ్చి పడుతోంది. దీంతో మొక్కల పూత, పిందె రాలిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. లక్షలు వెచ్చించి మిర్చిని సాగు చేస్తుంటే, ఫ్యాక్టరీ దుమ్ము తమ పంటను నాశనం చేస్తోందన్నారు. అలాగే పొలాల గట్లపై గడ్డి మీద కూడా దుమ్ము పేరుకుపోతోందని, ఆ గడ్డిని తిన్న పశువులు గర్భకోశ వ్యాధులకు గురవుతున్నాని తెలిపారు. సిమెంటు దుమ్ము నుంచి తమకు ఇంత నష్టం జరుగుతోందని ఫ్యాక్టరీ యాజమాన్యానికి తెలియ జేసినప్పటికీ వారే ఏ చర్యలు తీసుకోవడం లేదన్నారు. పైగా తమ సమస్యలను తేలిగ్గా తీసేస్తున్నారని విమర్శించారు. అధికారులు జోక్యం చేసుకొని తమను ఈ నష్టాల నుంచి కాపాడాలని, ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్య తీరుపై తగు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో రైతులు బండి శ్రీనివాసరావు, పోలిశెట్టి బ్రహ్మానందరావు, శివకృష్ణ, కిచ్చంశెట్టి పకీరయ్య, మామిడి అంకారావు, నరసింహారావు పాల్గొన్నారు.

మీ అవినీతి.. మా అభివృద్ధిపై

బహిరంగ చర్చకు అంబటి సిద్ధమా ?

సత్తెనపల్లి, ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధి, వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతిపై బహిరంగ చర్చకు సిద్ధమా? అని టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి భీమినేని వందనా దేవి మాజీ మంత్రి అంబటి రాంబాబుకు సవాల్ విసిరారు. ఆదివారం టీడీపీ ప్రజా వేదికలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మాజీ మంత్రి అంబటి రాంబాబు నియోజకవర్గంలో షాడో ఎమ్మెల్యే అంటూ పదేపదే మాట్లాడటం తగదని అన్నారు. శవ యాత్ర, జైలు యాత్ర లాంటి కార్యక్రమాలు వైఎస్ జగన్ మానుకోవాలన్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నిధుల్లో కూడా లంచమడిగిన అంబటి రాంబాబుకు కన్నా లక్ష్మీనారాయణ గురించి మాట్లాడే నైతిక అర్హత లేదన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో అంబటి అల్లుడు, ఆయన తమ్ముడు నియోజకవర్గాన్ని అన్నివిధాలా దోచుకున్నారన్నారు. సత్తెనపల్లి నుంచి నియోజకవర్గ ఓటర్లు తరిమివేసినా అంబటి రాంబాబుకు బుద్ధి రాలేదన్నారు. టీడీపీపై, ఎమ్మెల్యే కన్నాపై చవకబారు వ్యాఖ్యలు చేస్తే తగినవిధంగా గుణపాఠం చెబుతామని ఆమె హెచ్చరించారు. సమావేశంలో గొర్రెపాటి సుశీల, తోట అంబిక, రాజేశ్వరి, ఆండాలు, సీతమ్మ, మల్లేశ్వరి, కందిమళ్ళ రజిని తదితరులు పాల్గొన్నారు.

వంకాయలపాటికి నివాళులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన టీడీపీ క్రియాశీలక కార్యకర్త వంకాయలపాటి చంద్రశేఖర్ మరణం బాధాకరమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని కాకతీయ కళ్యాణ మండపంలో ఆదివారం వంకాయలపాటి చంద్రశేఖర్ సంస్మరణ సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, పలువురు టీడీపీ నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఎలినేడి రామ స్వామి, మదమంచి రాంబాబు, కల్లం వీరభాస్కర్‌రెడ్డి, పూజల వెంకట కోటయ్య, పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

జనసేన నేత విరాళంతో

సీసీ కెమేరాల ఏర్పాటు


క్రోసూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని హసానాబాద్‌లో సీసీ కెమెరాల ఏర్పాటుకి గానూ గ్రామానికి చెందిన జనసేన నేత తోకల శివరామయ్య రూ.15 వేలు విరాళాన్ని ఆదివారం ఎస్‌ఐ నాగేంద్రరరావుకు అందజేశారు. ఈ సందర్భం గా ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రతి గ్రామం స్థానికుల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలియజేశారు. కార్యక్రమంలో జనసేన లీగల్ సెల్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి బయ్యవరపు నరసింహారావు, తోకల వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న డీఎస్పీ హనుమంతరావు

ఆలయాల వద్ద పటిష్ట బందోబస్తు

● సత్తెనపల్లి డీఎస్పీ హనుమంతరావు
● అమరేశ్వరాలయంలో ఏర్పాట్ల పరిశీలన

అమరావతి,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి) మహాశివరాత్రి ఉత్సవాలకు అమరావతిలోని ఆలయాలను సందర్శించే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు తెలిపారు. ఎస్పీ కె శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం ఆయన స్థానిక సీఐ అచ్చయ్య, ఎస్‌ఐలు రాజశేఖర్, అమీర్‌లతో కలసి ఆలయ ప్రాంగణం, నదీ తీరాన్ని పరిశీలించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ క్యూలలో రద్దీ పెరగకుండా భక్తులకు త్వరితగతిన స్వామివారి దర్శనం జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు. నదీ తీరంలో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ సమస్య లేకుండా అదనపు పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. 27న జరిగే స్వామి వారి దివ్యరథోత్సవం విజయవంతమయ్యేలా పటిష్ట చర్యలు తీసుకుంటామని డీఎస్పీ వివరించారు.


స్వామి వారికి అభిషేకాలు చేస్తున్న డీఎస్పీ జగదీష్

బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయంలో

డీఎస్పీ జగదీష్ అభిషేకాలు

మాచవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : శివరాత్రి మహోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని మోర్జంపాడు శివారు పురాతన బుగ్గ మల్లేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం గురజాల డీఎస్పీ జగదీష్ అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ ధర్మకర్తలు, పూజారులు డీఎస్పీ జగదీష్‌కు స్వాగతం పలికారు. అనంతరం డీఎస్పీకి ఆలయానికి సంబంధించిన చిత్రపటాలను అందజేశారు. శివరాత్రి రోజున భక్తుల రద్దీ దృష్ట్యా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని ధర్మకర్తలు డీఎస్పీని కోరారు. కార్యక్రమంలో మాచవరం ఎస్‌ఐ సతీష్, ఆలయ ధర్మకర్తలు మండాది హరనాథబాబు, ప్రసాదు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న హనుమంతురావు

ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభం

కారంపూడి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయం అభివృద్ధి పనులను ఆదివారం ఎండోమెంట్ అధికారి కొల్లి హనుమంతురావు ప్రారంభించారు. ఆలయం స్లాబ్ పగుళ్ల రావడంతో వర్షాలు కురిసిన సమయంలో నీరంతా దేవాలయంలోకి చేరడంతో భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. ఎండోమెంట్ అధికారి హనుమంతురావు ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లగా రూ. 1.48 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ నిధులతో ఆలయంలో అభివృద్ధి పనులు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): వీరాపురం గ్రామానికి చెందిన భీమినేని మల్లేశ్వరరావు (68) ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పొలం పనులు ముగించుకొని ద్విచక్ర వాహనంపై ఇంటికి వస్తుండగా వీరాపురం-సాంబశివపేట మధ్యలో గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో మల్లేశ్వరరావుకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్సకోసం అతడిని పట్టణంలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు, పలువురు నేతలు మల్లేశ్వరరావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

మట్టిఖర్చులకు ఆర్థికసాయం

రెంటచింతల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేద్కర్ కాలనీకిలో నివాసం ఉంటూ, నాప రాయి కార్మికుడిగా పని చేస్తున్న దేగల ఏసోబు శనివారం అక స్మాత్తుగా మృతిచెందాడు. విషయం తెలుసుకున్న చైతన్య నాప రాయి లోడింగ్, అన్ లోడింగ్, భవన నిర్మాణ కార్మిక సంఘ అధ్యక్షుడు మామిడి పెదసామ్యేల్ ఆదివారం ఏసోబు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం మట్టిఖర్చుల నిమిత్తం రూ.5వేలను మృతుడి భార్య లలితమ్మకు అందచేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శేఖరబాబు పాల్గొన్నారు.

పారిశుధ్య స్పెషల్ డ్రైవ్

మాచవరం, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం కూడా పారిశుధ్య స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో వెంగళవారం పలు గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందజేశారు. ఇంటింటి నుంచి సేకరించిన తడి చెత్త, పొడి చెత్తను తప్పనిసరిగా సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. మాచవరం సర్పంచ్ నరేష్, పంచాయతీ సెక్రటరీ కోటేశ్వరరావు మాచవరం గ్రామంలో వీధులన్నీ తిరుగుతూ పనులను పర్యవేక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.


మాచవరంలో పారిశుధ్య డ్రైవ్‌లో భాగంగా సర్పంచ్, సెక్రటరీలు సూచనలు ఇస్తున్న దృశ్యం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జూలకంటి, ఎమ్మెల్సీ అభ్యర్థి రాజేంద్రప్రసాద్

ఖాళీ పోస్టులను భర్తీ చేస్తాం

● మొదటి ప్రాధాన్య ఓటుతో ఆశీర్వదించండి..
● కృష్ణా, గుంటూరు నియోజకవర్గాల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి

మాచర్లటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖా మంత్రి లోకేశ్‌ల నేతృత్వంలో విద్యాశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేస్తామని, పోస్టుల భర్తీ అనంతరమే రాబోవు విద్యా సంవత్సరంలో పాఠశాలలు తెరుస్తామని కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రమైన వెల్దుర్తిలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డితో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పల్నాటి ప్రాంత పట్టభద్రులు తమ మొదటి ప్రాధాన్యత ఓటుతో తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధిలో పయనించాలంటే ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. ప్రధాని మోదీ సహకారంతో రాష్ట్రాభివృద్ధికి బాటలు పడుతున్నాయన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. నిరుద్యోగ యువతకు అండగా ఉంటామని, వారి అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ మనమంతా ఆలపాటిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామన్నారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో కూటమి నేతలు పంగులూరి పుల్లయ్య, యెనుముల కేశవరెడ్డి, కళ్లం రామాంజిరెడ్డి, మందలపు రామకృష్ణ, పంగులూరి అంజయ్య, రాజబోయిన మధు యాదవ్, గుండాల శ్రీనివాస్ యాదవ్, కజ్జం సైదయ్య, కూనిశెట్టి వెంకటేశ్వర్లు, కుర్రి శివారెడ్డి, గుమ్మడి నాసరయ్య, పులి హరి, బూసా రామాంజినేయులు, బొల్లా వెంకటేశ్వర్లు, లింగా చిన మాధవరావు, గొంటు శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సత్తెనపల్లిలో ఎమ్మెల్సీ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కన్నా, జనసేన నేతలు

ఆలపాటి గెలుపు కోసం పనిచేద్దాం : ఎమ్మెల్యే కన్నా

సత్తెనపల్లి, (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాదు విజయం కోసం జన సైనికులు పనిచేయాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపు నిచ్చారు. ఆదివారం పట్టణంలో జనసేన శ్రేణులతో నిర్వహించిన సమావేశంలో కన్నా మాట్లాడుతూ జన సైనికులు గ్రామ గ్రామాన పట్ట భద్రులైన ఓటర్లను కలసి ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసేలా చూడాలన్నారు. అనంతరం ఎన్నికల కరపత్రాలను జన సైనికులతో కలసి కన్నా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎలినేడి రామస్వామి, శిరిగిరి శ్రీనివాసరావు, తవిటి భవన్నారాయణ, ఆతుకూరి నాగేశ్వరరావు, దరువూరి నాగేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య, కట్టా రమేష్ కూటమి నేతలు పాల్గొన్నారు.

పిడుగురాళ్ల,(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి ఆలపాటి రాజేంద్రప్రసాద్ విజయాన్ని కాంక్షిస్తూ కూటమి నేతలు పిడుగురాళ్లలో ఎన్నికల ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, మైనారిటీ సెల్ అధ్యక్షులు సయ్యద్ అమీర్‌అలి, జనసేన అధ్యక్షడు కామిశెట్టి రమేష్, దూదేకుల ఖాశింసైదా కూటమి నేతలు పలువురు మున్సిపల్ కార్యాలయం, సచివాలయాలతో పాటు ఇంటింటికి వెళ్లి పట్టభద్రులను కలిసి ఓటర్లను అభ్యర్థించారు.

కారంపూడి, (ఆంధ్రజ్యోతి): పట్టభద్రులు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు అయ్యేందుకు కూటమి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పంగులూరి అంజయ్య కోరారు.

క్రోసూరు,(ఆంధ్రజ్యోతి): మండలంలోని దొడ్లేరులో విజ్ఞాన్ హైస్కూల్, జిల్లా పరిషత్ హైస్కూల్ ఉపాధ్యాయులతో నియోజకవర్గ పరిశీలకులు నల్లపాటి రాము సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల అనంతరం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్టు మంత్రి లోకేశ్ ఇప్పటికే ప్రకటించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆలపాటికి మొదటి ప్రాధాన్య ఓటు వేసి గెలిపించాలని పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు గుడిపాడు బాషా, సైదా, మొగల్‌జాన్, హనుమంతరావు, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

అచ్చంపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడువాయి,చల్లగరిగ, గింజుపల్లి, మాదిపాడు గ్రామాల్లో టీడీపీ నేతలు ఇంటింటికి తిరుగుతూ పట్ట భద్రులను కలిసి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు ఓటువేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, నేతలు పాటిబండ్ల బాపిరాజు, వెనిగండ్ల కోటయ్య, మూడావత్ బాలూ నాయక్, పసుపులేటి పాపిరెడ్డి, శాఖమూరి బాజీ, తిరువాయిపాటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు షీల్డ్, ప్రశంసా పత్రాలను అందజేస్తున్న తహసీల్దార్ ధనలక్ష్మి

ముగిసిన జిల్లా స్థాయి క్రీడా పోటీలు

పెదకూరపాడు, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి) : నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో జన చైతన్య సమితి ఆధ్వర్యంలో పెదకూరపాడులోని జీఆర్ సీఆర్‌కే శ్రీ చైతన్య స్పోర్ట్స్ అకాడమీ క్రీడా ప్రాంగణంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలు ఆదివారం ముగిశాయని జన చైతన్య సమితి కార్యదర్శి తుళ్ళూరి సాంబశివరావు తెలిపారు. వాలీబాల్‌లో పెదకూరపాడు జీఆర్‌సీఆర్‌కే శ్రీ చైతన్య స్పోర్ట్స్ అకాడమీ టీమ్ ప్రథమ స్థానం, మేడికొండూరు మండలం పాలడుగు టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. కబడ్డీలో పెకూరపాడు టీమ్ ప్రథమ స్థానం, జీఆర్‌సీఆర్‌కే శ్రీ చైతన్య స్పోర్ట్స్ అకాడమీ టీమ్ ద్వితీయ స్థానంలో నిలిచాయి. విజేత జట్ల క్రీడాకారులకు తహసీల్దార్ ధనలక్ష్మి మెడల్స్ ప్రశంసా పత్రాలు, షీల్డ్‌లను అందజేశారు. వంద మీటర్ల పరుగు, షాట్‌పుట్ పోటీల్లో గెలుపొందినవారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అకాడమీ డైరెక్టర్ గుత్తా రాము, ప్రిన్సిపాల్ గుత్తా కవిత, వీఆర్‌వోలు శ్రీలక్ష్మి, శ్రీకాంత్, జాన్ సైదా, పీఈటీలు షేక్ అబూ బకర్, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహా శివరాత్రి వేడుకలకు 'ధనమల్లయ్య' ముస్తాబు

కారంపూడి, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): నల్లమల దొనకొండల్లోని మల్లికార్జునస్వామి ఆలయంలో ధన మల్లయ్యగా పూజలందుకుంటున్న స్వామి వారిని శివరాత్రి వేడుకలకు సిద్ధం చేస్తున్నారు. ఒప్పిచర్ల నుంచి ఐదు కిలో మీటర్ల దూరంలో ఈ ఆలయం ఉంది. కార్తీక, మాఘ మాసాల్లో భక్తులు ఈ ఆలయానికి అధిక సంఖ్యలో వచ్చి స్వామి వారికి అభిషేకాలు జరిపి, పొంగళ్లు సమర్పించి మొక్కులు తీర్చుకుంటుంటారు. 26వ తేదీన మహాశివరాత్రి వేడుకలకు ఆలయం ముస్తాబవుతోంది. ఆ రోజు మహా అన్నదానం నిర్వహించనున్నారు.


ధనమల్లయ్యస్వామి

ఆలయ చరిత్ర.. నల్లమల అటవీ ప్రాంతంలోని దొనకొండల్లో గల ఈ ఆలయం ఎంతో చారిత్రాత్మకమైంది. 1184లో పల్నాటి యుద్ధ సమయంలో శివ భక్తురాలైన గురజాల రాజ్యమంత్రి నాయకురాలు నాగమ్మ ధనమల్లయ్యను దర్శించుకొని ఆలయాన్ని నిర్మించిందని చరిత్ర చెబుతోంది. ఒప్పిచర్ల గ్రామస్తులు ఆలయానికి మార్గాన్ని ఏర్పాటుచేసి కొండపైకి మెట్లు నిర్మించారు. కాశీ అన్నపూర్ణేశ్వరి, విఘ్నేశ్వరస్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఆలయం ముందు దొనకొండ కింది భాగంలో ఉన్న నీటి కొలనులో ఎప్పటికీ నీరు ఇంకకపోవటం ఇక్కడి మహత్యంగా చెబుతుంటారు.

వైభవంగా అంకమ్మతల్లి తిరునాళ్ల

● ఆలయంలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కన్నా
● అలరించిన కోలాట ప్రదర్శనలు


అమ్మవారి దైవాలు ఊరేగింపు చేస్తున్న పెమ్మా, వసంతపువారు

రాజుపాలెం,ఫిబ్రవరి23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజుపాలెం గ్రామంలో ఉన్న అంకమ్మతల్లి ఆలయ 56వ వార్షిక తిరునాళ్ల మహోత్సవాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, టీడీపీ నియోజకవర్గ నేతలు మన్నెం శివనాగమల్లేశ్వరరావు (అబ్బూరు మల్లి), డాక్టర్‌పడ్డెంపూడి పవన్‌కుమార్, డాక్టర్ సింగరాజు సాయికృష్ణ, టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బొర్రా వెంకటప్పారావు, జనసేన మండల అధ్యక్షుడు తోట నరసయ్య తదితరులు అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.


ఆశీర్వచనాలు పొందుతున్న ఎమ్మెల్యే కన్నా

తొలుత రాజుపాలెం, గంగిరెడ్డిపాలెం గ్రామాల్లో అమ్మవారి దైవాలను పెమ్మా, వసంతపువారు ఊరేగింపు చేశారు. భక్తులు మంగళవాయిద్యాలతో పట్టు వస్త్రాలు, బోణాలు సమర్పించారు. తిరునాళ్లను పురస్కరించుకుని ఆలయ పరిసరాలలో నాలుగు ప్రదేశాలలో అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం గ్రామంలోని ఊరబావి సెంటర్ వద్ద సీతారామ మహిళా కోలాట సమాజం ఆధ్వర్యంలో కోలాటం, పాఠశాల విద్యార్థులచే ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మురళీ కోలాట ప్రదర్శన జరిగింది. రాత్రి పాట కచ్చేరిలు ఏర్పాటు చేశారు. తిరునాళ్ల సందర్భంగా ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో ముస్తాబుచేశారు. తిరునాళ్లలో ఎటువంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా ఎస్‌ఐ వేణుగోపాల్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.


సీతారామ మహిళా సమాజం వారి కోలాట ప్రదర్శన

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

చచ్చిన కోళ్లను విక్రయిస్తే దుకాణాలు సీజ్ : కమిషనర్



కమిషనర్ పి.శ్రీహరిబాబు

చిలకలూరిపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): అపరిశుభ్ర వాతావరణంలో మాంసం విక్రయాలు చేయవద్దని, మాంసం, చికెన్ దుకాణాలపై నిరంతర నిఘా ఉంచుతామని మున్సిపల్ కమిషనర్ పి.శ్రీహరిబాబు ఆదివారం అన్నారు. చనిపోయిన కోళ్లను విక్రయిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజారోగ్యం దృష్ట్యా చికెన్, మాంసం విక్రయదారులు నాణ్యమైన, శుభ్రమైన మాంస విక్రయాలు చేయాలని సూచించారు. పట్టణంలోని కొన్ని చికెన్ దుకాణాల్లో చచ్చిన కోళ్లను విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందాయన్నారు. చనిపోయిన కోళ్లను కోసి, రోజులపాటు డీప్‌ఫ్రీజర్‌లో భద్రపరిచి విక్రయిస్తున్నట్లు సమాచారం అందిందని, వీటిపై నిఘా ఏర్పాటుచేసి స్పెషల్ డ్రైవ్‌కు ఆదేశాలు జారీ చేశామన్నారు. రోడ్లపై జంతువధ చేస్తున్నవారిపై కూడా చర్యలు తీసుకుంటామన్నారు. నాణ్యతతో కూడిన మాంసం విక్రయించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు.

త్రికోటేశ్వరుని మెట్లమార్గాన్ని శుభ్రంచేసిన చిలకలూరిపేట వాకర్లు



మెట్ల మార్గాన్ని శుభ్రం చేస్తున్న చిలకలూరిపేట వాకర్స్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి మెట్ల మార్గాన్ని ఆదివారం స్థానిక సీఆర్ కాలనీ పార్క్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శుభ్రం చేశారు. 45మంది సంఘ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామివారికిసేవ చేయటం తమ అదృష్టంగా భావిస్తున్నట్టు వారు పేర్కొన్నారు.

రొంపిచర్ల మండలంలో ఇంటింటా చెత్త సేకరణ



అన్నవరంలో చెత్తసేకరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

రొంపిచర్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజోతి): మండలంలోని గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఈవోపీఆర్‌డీ సతీష్, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు. గ్రామాల్లో పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని ఈవోపీఆర్‌డీ కోరారు. తడి, పొడిచెత్తలను వేర్వేరుగా అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

వరికిపూడిశెల ప్రాజెక్టుకు

రూ.100కోట్లు కేటాయించాలి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 28న జరిగే రాష్ట్ర బడ్జెట్ సమావేశాల్లో వరికపూడిశెల ప్రాజెక్టుకు రూ.100 కోట్లు కేటాయించి పనులు ప్రారంభించాలని ఏపీ గిరిజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ ఆదివారం డిమాండ్ చేశారు. సుమారు 27 గ్రామాలలోని జనాభాకు సాగునీరు, తాగునీటి సమస్య లేకుండా ఉండేందుకు ఈ ప్రాజెక్టును తక్షణం పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

నేడు, రేపు అన్న ప్రసాద వితరణ

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రముఖ శైవ క్షేత్రం కోటప్పకొండలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 24, 25 తేదీలలో గిరిప్రదక్షిణ సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత అన్న ప్రసాద వితరణ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వెంకయ్యచౌదరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కోటప్పకొండలో ప్రతి నెల పౌర్ణమి రోజు గిరిప్రదక్షిణ భక్తులకు మార్గమధ్యంలో మంచినీటి సౌకర్యం, విజయగణపతి దేవస్థానం ఎదురు అల్పాహారం ఏర్పాటుచేయనున్నట్లు తెలిపారు.

ఏపీ మోడల్ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశపరీక్షకు

దరఖాస్తుల ఆహ్వానం

రొంపిచర్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజోతి): మండలంలోని రెడ్డిపాలెం పీఎం శ్రీ ఏపీ మోడల్ పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశపరీక్షకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ప్రిన్సిపాల్ రవినాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25వ తేదీ నుంచి మార్చి 31వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు కనీస వయసు పది నుంచి 12 సంవత్సరాలు ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు పది నుంచి 14 సంవత్సరాల వయసు ఉండాలన్నారు. సదరు విద్యార్థులు ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదివి ఉండాలన్నారు. ఏప్రిల్ 20వ తేదీ పాఠశాలలో పరీక్ష జరుగుతుందన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులకు కనీస మార్కులు 35, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 30 మార్కులుగా నిర్ణయించారన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వారబంది లేకుండా సాగు నీరివ్వాలి

రొంపిచర్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజోతి): రైతులకు వారబందితో ప్రమేయం లేకుండా సాగునీరు ఇవ్వాలని వైసీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు అన్నెంపున్నారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రైతులు రెండో పంటగా మొక్కజొన్న, దాళ్వా వరి, మినుము, పెసర పంటలను సాగు చేస్తున్నారన్నారు. ఈనెల 28వ తేదీ నుంచి వారబందిగా సాగునీరు ఇస్తామని తెలపటం వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఇదే విషయాన్ని డిసెంబరు నెలలో తెలియజేసి ఉంటే రైతులు రెండో పంట సాగు చేసేవారు కాదన్నారు. వారబంది అమలు చేస్తే ఎకరాకు రూ 25వేల నష్ట పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 30వ తేదీ వరకు వారబంది లేకుండా సాగునీరు ఇవ్వాలన్నారు.

ఘనంగా రోటరీ ఆవిర్భావ దినోత్సవం

చిలకలూరిపేట, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): రోటరీ 120వ ఆవిర్భావ వేడుకలను రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో స్థానిక రోటరీ భవన్‌లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. రోటరీ జిల్లా మాజీ గవర్నర్ డాక్టర్ జాస్తి రంగారావు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ప్రపంచ శాంతి, పరస్పర స్నేహం, సేవాభావాలతో 1905 సంవత్సరం ఫిబ్రవరి 23న పాల్ హరీస్ తన నలుగురి స్నేహితులతో రోటరీ ఇంటర్నేషనల్ క్లబ్ స్థాపించారని చెప్పారు. ఈ సందర్భంగా వందమంది హెచ్ఐవీ బాధితులకు రోటరీ క్లబ్ ద్వారా కందిపప్పు పంపిణీ చేశారు. క్లబ్ మాజీ అధ్యక్షుడు రొటేరియన్ గల్లా సాంబశివరావు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఆళ్ల వేమనరెడ్డి, ఉప్పుటూరి ప్రసాదు, క్లబ్ సభ్యులు తొట్టింపూడి వెంకటేశ్వరరావు, మండవ లక్ష్మీనారాయణ, ముక్తార్ అహ్మద్, కాపు వెంకటరావు పాల్గొన్నారు.

శిథిలావస్థలో కారుమంచి వంతెన

● వయ్యకల్లు బ్రిడ్జి కోసం 50 ఏళ్ళుగా నిరీక్షణ



కారుమంచిలో శిథిలావస్థకు చేరిన వంతెన



వయ్యకల్లు-ధర్మపురి మార్గంలో వాగు

శావల్యాపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శావల్యాపురం మండలం కారుమంచి గ్రామసమీపంలో అద్దంకి బ్రాంచ్ కెనాల్‌పై నిర్మించిన వంతెన పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఈ వంతెనను పునర్నిర్మాణం చేసిందిలేదు. 2017లో టీడీపీ ప్రభుత్వ హయాంలో కారుమంచి టీడీపీ నాయకులు అప్పటి భారీ నీటిపారుదలశాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును సచివాలయంలో కలసి విషయాన్ని ఆయనకు వివరించి బ్రిడ్జి నిర్మాణానికి వినతిపత్రం సమర్పించారు. దాంతో ఎన్నెస్పీ అధికారులు వంతెనను పరిశీలించి బ్రిడ్జి నిర్మాణానికి అంచనాలు కూడా సిద్ధం చేశారు. కానీ ప్రభుత్వం నిధులు మంజూరుచేయలేదు. తర్వాత అధికారంలోకొచ్చిన వైసీపీ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణం వైపు కన్నెత్తయినా చూడలేదు. బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరులోని అద్దంకి-నార్కెట్‌పల్లి జాతీయ రహదారి ఎక్కేందుకు కారుమంచి మీదుగా నిత్యం వివిధ గ్రామాలనుండి వందలకొద్దీ వాహనాలు ఈ బ్రిడ్జిపైనుండి ప్రయాణిస్తుంటాయి. బ్రిడ్జిపై రెయిలింగ్ కూడా లేకపోవడంతో రాత్రివేళల్లో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మరోసారి టీడీపీ నాయకులు బ్రిడ్జి నిర్మాణం గురించి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుకు విన్నవించగా అధికారులనుపంపి అంచనాలు వేయించారు. అంచనాలేసి రెండునెలలు కావస్తున్నా ఎటువంటి పురోగతిలేదని గ్రామస్తులు వాపోతున్నారు.

● వయ్యకల్లు-ఏనుగుపాలెం వెళ్ళే దారిలో వయ్యకల్లు, ధర్మపురికి మధ్యలోనున్న వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం గ్రామస్తులు 50ఏళ్ళుగా ఎదురుచూస్తున్నారు. కానీ వారి కల నేటికీ సాకారం కాలేదు. వాగుపై బ్రిడ్జి లేకపోవడంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే ప్రయాణీకులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అదే మార్గంలో రోడ్డు, వాగుపై బ్రిడ్జి నిర్మాణాలకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసి రూ.2కోట్లు పైచిలుకు నిధులు కూడా కేటాయించింది. అంతలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వాటిని నిలిపివేసింది. ఇదే మార్గం గుండా రోజుకు వందల కొద్దీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వర్షాకాలంలో వాగు పొంగి పొర్లుతుండడంతో ప్రయాణీకులు, రైతులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కనీసం బ్రిడ్జినైనా నిర్మిస్తే వాగు ప్రవహించేప్పుడు ప్రమాదాలు జరగకుండా ఉంటాయని ప్రజలు వేడుకుంటున్నారు. మరలా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రోడ్డు, బ్రిడ్జి నిర్మాణాలకు అనుమతులు వస్తాయని వారు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ఇంటింటా చెత్త సేకరణపై దృష్టి సారించాలి

డీపీవో విజయభాస్కర్‌రెడ్డి



వర్మికంపోస్ట్ ఎరువుల తయారీని పరిశీలిస్తున్న డీపీవో విజయభాస్కర్‌రెడ్డి

శావల్యాపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఇంటింటికీ చెత్తసేకరణపై గ్రామసర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిని సారించి గ్రామాలను పరిశుభ్రమైన గ్రామాలుగా తీర్చిదిద్దాలని జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శావల్యాపురంలో ఇంటింటికీ చెత్తసేకరణ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలోని పలు కాలనీలను, వీధులను స్వయంగా పరిశీలించి పారిశుధ్య కార్యక్రమాలపై ఆరా తీశారు. గ్రామంలోని ప్రతి ఇంట్లో, దుకాణాల వద్ద తప్పకుండా డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేసుకోవాలని, రోడ్ల పక్కన చెత్తచెదారం వేయరాదని, పారిశుధ్యం మెరుగుదలకు సహకరించాలని కోరారు. అనంతరం చెత్తసేకరణ కేంద్రంలో తడి, పొడిచెత్తలను వేరు చేస్తున్న విధానం, వర్మి కంపోస్ట్ తయారీ తదితర అంశాలను పరిశీలించారు. గ్రామాల్లో క్లాప్‌మిత్రలందరికీ జాకెట్‌లు, గ్లౌజ్‌లు, పారిశుధ్య కిట్లను అందజేయాలని, క్లాప్‌మిత్రల వేతనాలు పెండింగ్‌లో ఉంటే 15వ ఆర్థికసంఘం నిధుల నుంచి వెంటనే చెల్లించాలని ఈవోపీఆర్డీ సుగుణ, పంచాయతీ కార్యదర్శి యాకోబులకు తెలిపారు.

వెనుకబడిన జిల్లాలకు కేంద్ర బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం

బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్

వినుకొండటౌన్, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): మోదీ వికసిత్ భారత్ కోసం సామాన్య, మధ్య తరగతి, ఉద్యోగ, పారిశ్రామికవేత్తలకు, రైతులకు అనుకూలంగా ఉండేలా బడ్జెట్ రూపొందించడం జరిగిందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరి జయప్రకాష్ అన్నారు. ఇటీవల కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025-26 ప్రజాబడ్జెట్‌పై కారంపూడి రోడ్డులోని బృందావన్‌గార్డెన్స్‌లో ఆదివారం మేధావుల సమావేశం నిర్వహించారు. పల్నాడు జిల్లాలోని 34 మండలాల నుంచి వివిధ సామాజికవర్గాలకు చెందిన మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వల్లూరి మాట్లాడుతూ దేశంలో వెనుకబడిన 100 జిల్లాలను ఎంపిక చేసి రైతుల కోసం ధన, ధాన్యాభివృద్ధికి కృషిచేసేందుకు బడ్జెట్‌లో ప్రాధాన్యత కల్పించారన్నారు. పంటల ఎగుమతికి ఇంటర్‌రోడ్డు కనెక్షన్ సౌకర్యంతో పాటు వ్యవసాయానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. మిర్చిధరపై మార్కెట్‌లో 25శాతం ఉన్న ఇంటర్‌షిప్ 75 శాతానికి పెంచి రూ.125కోట్లు అందిస్తుందని తెలిపారు. విద్యార్థులను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దేందుకు రూ.5కోట్ల నుంచి రూ.100 కోట్లవరకు సబ్సిడీపై రుణాలను అందించేందుకు బడ్జెట్‌లో ప్రతిపాదించారన్నారు. ఆయుష్‌మాన్‌భారత్ కింద 70 సంవత్సరాల వృద్ధులకు ఉచితవైద్యం అందిస్తున్నాని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశికుమార్, జిల్లా మాజీ అధ్యక్షుడు ఆలోకం సుధాకర్‌బాబు, రైల్వేబోర్డు మెంబరు గోరంట్ల సత్యనారాయణ, పూర్ణచంద్రరావు, యువమోర్చ స్టేట్ ఎగ్జిక్యూటివ్ బాడీ మెంబరు పులిగుజ్జు మహేష్, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ వంశీ, జిల్లా ప్రధానకార్యదర్శి మేడం రమేష్, నియోజకవర్గ కన్వీనర్ యార్లగడ్డ లెనిన్, పట్టణ న్యాయవాది రామకోటేశ్వరావు, యలవర్తి శ్రీనివాసరావు, జనసేన పార్టీ నాయకులు నాగశ్రీను, కోకన్వీనర్ ఎం.వి.అప్పారావు, బీజేపీ పట్టణ అధ్యక్షుడు కోట వెంకట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లాపల్లిలో ఎంఎల్‌సీ ఎన్నికల ప్రచారం



బొల్లాపల్లిలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెమ్మసాని

బొల్లాపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): బొల్లాపల్లిలో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదు విజయాన్ని కాంక్షిస్తూ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావు ఆదివారం ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సారథ్యంలో గుంటూరు, కృష్ణా జిల్లాల ఎంఎల్‌సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాదుకు మొదటి ప్రాధాన్య ఓటును వేయాలని పట్టభద్రులను కలసి అభ్యర్థించారు. నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలు తీరాలంటే ఆలపాటికి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా పట్టభద్రులకు ఓటువేసే విధానంపై కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో షేక్ ఖాశిం, ఎలిశెట్టి రంగయ్య, షేక్ సుభానీ, రావూరి నారాయణ, షేక్ సుభానీ, ఈర్ల వెంకటేశ్వర్లు, బొల్లాపల్లి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆలపాటిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

ఈపూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఆలపాటి రాజేంద్రప్రసాదును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని టీడీపీ జిల్లా అధికారప్రతినిధి రాపర్ల జగ్గారావు కోరారు. మండలంలోని పలు గ్రామాలలో జగ్గారావు ఎన్నికల ప్రచారం చేశారు. ప్రచారంలో టీడీపీ నాయకులు బాలయ్య, కోటేశ్వరరావు, సైదులు, కోటి, బుచ్చారావు, హనుమయ్య, సుబ్బారావు తదితరులు ఉన్నారు.



ఈపూరులో ఎన్నికల ప్రచారం చేస్తున్న రాపర్ల జగ్గారావు

230 మందికి షుగర్, బీపీ పరీక్షలు

యడ్లపాడు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): సామాజిక, సాంస్కృతిక వేదిక బాసట ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత షుగర్, బీపీ వైద్య శిబిరం జరిగింది. స్థానిక పీఆర్ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ఈ శిబిరంలో వైద్యులు డాక్టర్ గుంటుపల్లి దివ్యతేజ, డాక్టర్ శొంటినేని నవ్యశ్రీ, డాక్టర్ గుంటుపల్లి భవ్యతేజలు వైద్యసేవలు అందించారు. శిబిరానికి హాజరైన 230మందికి పరీక్షలు నిర్వహించి రెండు నెలలకు సరిపడా మందులను అందించి షుగర్ బాధితులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. కార్యక్రమాలను బాసట అధ్యక్షుడు నూతలపాటి కాళిదాసు, సభ్యులు సామినేని శ్రీనివాసరావు, ముత్తవరపు రవీంద్రబాబు, కేతా రాంబ్రహ్మంలు పర్యవేక్షించగా వలంటీర్లు పోపూరి శ్రీనివాసరావు, బచ్చు రాజేష్, ముత్తవరపు వేణుగోపాల్, కోయ రామోజీరావు, రావి సురేష్, చిట్టిపోతు రంగారావు, రావూరి సురేష్ సహకారం అందించారు.

బాసట ప్రతిభా పరీక్షకు విశేష స్పందన

సామాజిక సాంస్కృతిక వేదిక బాసట నిర్వహించిన ప్రతి భా పరీక్షలకు విశేష స్పందన లభించింది. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుపేద ప్రతిభావంతులైన విద్యార్థుల ఉన్నత విద్యకు ఆర్థిక చేయూతనందించేందుకు ఈ పరీక్షను నిర్వహించారు. స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ పరీక్షకు మండలంలోని తొమ్మిది జడ్పీ హైస్కూళ్లు, ఒక ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న 304మంది విద్యార్థులు హాజరయ్యారు. ఎంఈవో నాగరత్నం, ఎస్ఐ బాలకృష్ణలు ముఖ్యఅతిథులుగా హాజరై పరీక్ష పేపరును ఎంపిక చేశారు. తొలి ర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.50వేలు, ద్వితీయ ర్యాంకు వారికి రూ.30వేలు, తృతీయ ర్యాంకు విద్యార్థికి రూ.20వేలు, నాలుగో ర్యాంకుకు రూ.11వేలు, ఐదో ర్యాంకు విద్యార్థికి రూ.9వేల ఉపకార వేతనంగా అందిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

నగదు డిపాజిట్‌లకు అధిక వడ్డీ

శావల్యాపురం సీజీజీబీ మేనేజర్ శివకృష్ణ



శావల్యాపురంలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మేనేజర్ శివకృష్ణ

శావల్యాపురం, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ నందు నగదు డిపాజిట్‌లపై ప్రజలకు అధిక వడ్డీలను అందిస్తున్నట్లు శావల్యాపురం బ్రాంచ్ మేనేజర్ వలేటి శివకృష్ణ తెలిపారు. సీజీజీబీలో అమలులోనున్న పథకాలపై శావల్యాపురం సెంటర్‌లో ప్రజలకు ఆదివారం విస్తృతస్థాయి ప్రచారాన్ని నిర్వహించారు. మేనేజర్ శివకృష్ణ మాట్లాడుతూ నగదు డిపాజిట్‌లపై అత్యధిక వడ్డీలు చెల్లిస్తున్న ఏకైక ప్రభుత్వరంగ సంస్థ తమ బ్యాంక్ మాత్రమేనన్నారు. సాధారణ డిపాజిట్‌లపై 8.1శాతం, సీనియర్ సిటిజన్‌లకు 8.6శాతం వడ్డీ చెల్లిస్తున్నామన్నారు. త్వరలో వడ్డీరేట్లు తగ్గే అవకాశమున్నందున ఖాతాదారులంతా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజీజీబీలో అమలు చేస్తున్న జీవిత బీమా పథకాలతో పేదకుటుంబాలకు ఎంతో మేలు జరగనుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సామాజిక భద్రత పించన్‌లు, వివిధ పథకాలను గురించి ప్రజలకు వివరించారు. బ్యాంక్ సిబ్బంది దిలీప్‌కుమార్, అరుణ్‌కుమార్, సాయిరామ్, రామిరెడ్డి, కోటి, సన్నీ పాల్గొన్నారు.

సమర్థవంతంగా రీసర్వే





తహసీల్దార్ జీ రమేష్‌కుమార్

నూజెండ్ల, ఫిబ్రవరి 23 (ఆంధ్రజ్యోతి): సమర్థవంతంగా రీసర్వే చేస్తున్నట్టు తహసీల్దార్ జీ రమేష్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన ఆంధ్రజ్యోతి మాట్లాడుతూ రీసర్వే, అగ్రహారం భూములకు హక్కులు కల్పించటం, ప్రభుత్వ భూముల్లో నివాసం ఉంటున్న గృహాల క్రమబద్ధీకరణ తదితర అంశాలను వివరించారు....

ప్రశ్న: రీ సర్వేలో రైతుల అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇస్తున్నారా?

జవాబు: మండలంలోని త్రిపురాపురం రెవెన్యూ గ్రామంలో రీసర్వే నిర్వహిస్తున్నామని, రైతుల సమక్షంలోనే భూములను కొలతలు వేసి వివరాలను రైతులకు నోటీసు రూపంలో ఇచ్చి వారి అభ్యంతరాలను సత్వరమే పరిష్కరిస్తున్నాం.

ప్రశ్న: ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారా?

జవాబు: మండల పరిధిలోని ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని నివాసాలు ఏర్పరుచుకున్న వారిని గుర్తించి ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జీవో నెంబరు 30పై రెవెన్యూ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు.

ప్రశ్న: అగ్రహారం భూముల రైతుల సమస్యలు పరిష్కారం ఎప్పటికి జరుగుతుంది?

జవాబు: మండలంలోని కొండ్రప్రోలు, వీ అప్పాపురం, తిమ్మాపురం గ్రామాల్లోని అగ్రహారం భూముల(ఇనామ్) రైతులకు హక్కులు కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. త్వరలోనే రైతులకు హక్కుల పట్టాలు ఇస్తాం.

శ్రీ ప్రసన్న రామలింగేశ్వరస్వామికి లక్షబిల్వార్చన

వినుకొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): శ్రీప్రసన్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలో అర్చకుల సంఘం ఆధ్వర్యంలో స్వామివారికి లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా వేకువజామున మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని నగర సంకీర్తన మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, సువాసినీలచేత లక్ష కుంకుమార్చన, చక్ర అర్చన నిర్వహించారు. కార్యక్రమాల్లో బ్రాహ్మణ బంధువులు కుటుంబసమేతంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు పాలపర్తి సుబ్బయ్య, చంగవల్లి శ్రీరామచంద్రబాబు, నారాయణం రామ్మోహనాచార్యులు, ఎం.రాఘశర్మ, పోతుకూచి శ్రీనివాసశాస్త్రి, వేలమూరి శేషసాయిశర్మ, వెలమకన్ని చంద్రశేఖరశర్మ, ప్రతాపగిరి విష్ణుశర్మ, వేలమూరి సాయి తదితరులు పాల్గొన్నారు.

26న పార్వతీపరమేశ్వరుల కల్యాణమహోత్సవం

వినుకొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఈ నెల 26వ తేదీన మండలంలోని విఠంరాజుపల్లి గ్రామ సమీపంలో గల హిమాలయ గురువు ఆశీస్సులతో శాంతి ఆశ్రమ ట్రస్ట్ ఆధ్వర్యంలో పార్వతీపరమేశ్వరుల కల్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ నిర్వాహకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ప్రకటన విడుదల చేసినవారిలో అధ్యక్షుడు పెండేల వెంకటమోహన్‌రావు, కన్నెగండ్ల అనంతకోటేశ్వరరావు, పెండేల కాశీ, కొప్పురావూరి సుధాకర్, పుల్లారావు, మునిరెడ్డి తదితరులు ఉన్నారు.

తిరునాళ్ళ ఏర్పాట్లు పరిశీలన

ఈపూరు, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఈనెల 26వ తేదీ మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని సంజీవకొండపై జరుగు తిరునాళ్ళ ఏర్పాట్లను ఎస్ఐ ఎం ఉమామహేశ్వరరావు పరిశీలించారు. భక్తులుకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని ఆలయ నిర్వాహకులకు సూచించారు.

సారా తయారీ చట్ట రీత్యా నేరం

బొల్లాపల్లి, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): ఈపూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పరిధిలో నవోదయ - 2 కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండలంలోని ఎనిమిది తండాల్లో, పరిసర ప్రాంతాల వారికి అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ముందుగా తనిఖీలు నిర్వహించి అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ అధికారులు మాట్లాడుతూ సారా తయారీ, రవాణా చేయటం, సారా కలిగి ఉండటం, విక్రయించటం చట్టరీత్యా నేరమని, కఠినచర్యలు తీసుకోవటం జరుగుతుందన్నారు. ఈ దాడుల్లో ఈపూరు ఇన్‌చార్జ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కే శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

దేవాలయానికి రూ 2.16 లక్షల విరాళం

నాదెండ్ల, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరు గ్రామంలో పునర్నిర్మిస్తున్న రెడ్డిపేరంటాలమ్మ దేవాలయానికి రూ 2.16లక్షల విరాళాన్ని ఆదివారం పలువురు అందజేశారు. గ్రామానికి చెందిన లింగయ్య కుమారులు శ్రీనివాసరావు, కుటుంబసభ్యులు రవికుమార్, రాధా కుటుంబసభ్యులు ఈ మొత్తాన్ని ఆలయ కమిటీకి అందజేశారు.

నేత్రదానంతో చూపునివ్వడం అభినందనీయం



నేత్రదానం చేసిన మృతుడు బాల అంజయ్య (ఫైల్)

వేల్పూరు(శావల్యాపురం), ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మరణానంతరం నేత్రాలను దానంచేసి మరొకరికి చూపును ప్రసాదించడం అభినందనీయమని అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు అన్నారు. మండలంలోని వేల్పూరు గ్రామానికి చెందిన విప్పర్ల బాలఅంజయ్య అనారోగ్యంతో ఆదివారం మృతిచెందగా ఆయన కుటుంబసభ్యులు మృతుని నేత్రాల ను దానం చేశారు. చలపతిరావు ఇచ్చిన సమాచారం తో పెదకాకాని శంకర్ ఆసుపత్రి ఐబ్యాంక్ వే ల్పూరు కు వచ్చి మృతుడు బాలఅంజయ్య కళ్ళలోని కార్ని యా పొరలను సేకరించారు. చలపతిరావు మాట్లాడుతూ నేత్రదానం చేయదలచిన వారు మృతదేహాన్ని ఏసీబాక్స్‌లో ఉంచి 8గంటల్లో ఐబ్యాంక్‌కు స మాచారమివ్వాలన్నారు. నేత్రదానం చేసిన బాలఅంజయ్య కుటుంబసభ్యు లు ప్రసన్నాంజనేయులు, మారుతీ, ప్రసన్న, శివప్రసాద్, రామాంజనేయు లు, పరమేశ్వరరావు, ప్రసాద్, సింగరకొండలను గ్రామస్థులు అభినందించారు.

చెత్త నుంచి సంపద తయారీ

వినుకొండ, ఫిబ్రవరి 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీకటీగలపాలెం గ్రామంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా చెత్త సేకరణ, సంపద తయారీ కేంద్రంపై స్థానికులకు ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు వివరించారు. గ్రామాల్లో సేకరించిన తడిచెత్త నుంచి వర్మి కంపోస్టుతో పాటు ప్లాస్టిక్ నుంచి సంపదను తయారు చేసుకోవచ్చని సూచించారు. చెత్త నుంచి వచ్చిన డబ్బును పంచాయతీ ఖాతాల్లో జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ప్రభాకర్, కార్యదర్శి ఎస్‌కే జిలానీ, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.



చెత్తను సేకరిస్తున్న సిబ్బందితో ఇన్‌చార్జి ఈవోపీఆర్‌డీ శ్రీనివాసరావు